మంచిమాట
దేవాలయాలలో విగ్రహాలలోకాక
నిరుపేదలలో బలహీనులలో
ఆపన్నులలో భగవంతుడిని
దర్శించేవారంటేనే దేవుడికి ఇష్టం.
సాటిమనిషికి సాయం చేయనివాడు
భగవంతుడిని బంగారుపూలతో
పూజించినా వ్యర్థమే.

నిజాలు నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155


తెలంగాణ , సంపుటి : 28 సంచిక : 69 గురువారం, డిసెంబర్ 04, 2025 , పేజీలు - 12 వెల : 2/-

# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

**ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీ చేసాం**
**హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేది లేదు**
**తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం**
**ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం**
**బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం**
**సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి**
**హుస్నాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి**



**సిద్ధిపేట,డిసెంబర్ 03** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం మిగతా2లో...



## బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

**బిజెపి ఎంపిలకు మోడీ హితోక్తులు**

**న్యూఢిల్లీ, 03 :** పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారని సమాచారం. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, మిగతా2లో...

## తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

**రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్**
**భట్టితో కలిసి ఆహ్వానించిన సిఎం రేవంత్**
**దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం**





2లో

## మూగ బాలుడిపై కుక్కల దాడి

**మెరుగైన వైద్యం అందించాలని రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్,డిసెంబర్ 03 :** హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో మిగతా2లో...

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

**మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా ఉండాలి**
**గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కమిటీల ఏర్పాటు**
**జనసేన ముఖ్యనేతల సమావేశంలో పవన్ దిశానిర్దేశం**



**మంగళగిరి,డిసెంబర్ 03 :** జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు తమ పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు అభివృద్ధిలో భాగం కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో పవన్ సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రాంత అభివృద్ధిలో అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్దామన్నారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగామన్నారు. గ్రామ స్థాయిలో అయిదుగురు మిగతా2లో...


## ఓయూలో విద్యార్థులకు పాడైన అన్నం



2లో

# భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం**
**ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టం**
**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి**



**హైదరాబాద్,డిసెంబర్ 03 :** భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపర మైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు మిగతా2లో...



## రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

**- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 03 :** క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న మిగతా2లో...



## పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

**తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్**
**మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్,డిసెంబర్ 03 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. ఎల్బీనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు.మిగతా2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

**- ఐదుగురు మావోలు.. ఒక పోలీస్ మృతి**



**బీజాపూర్,డిసెంబర్ 03 :** అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్దరిల్లు తున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మిగతా2లో...

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం



**న్యూఢిల్లీ,డిసెంబర్ 03:** దేశ రాజధాని దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగ ళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిం దూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్య క్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరిం చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్‌ఆర్‌ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమ ంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానిం చారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరిం చిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి అందజేశారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులతో కమిటీని నియమించాలని, వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామని తెలిపారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ పలు సూచనలు ఇచ్చారు. పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.. ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకు సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధినేత పవన్ దిశానిర్దేశర చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి.. 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్ణయించారు.

# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్‌ఆర్‌ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశు వులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాద్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు.గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ం÷ఱఅ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్-కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు.

# భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షల్లేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్ఏలను నియమించామని తెలిపారు. 490మంది సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వేయర్లను అలాట్ చేశామని తెలిపారు.

# రాహుల్‌ను విమర్శించే స్థాయి కెటిఆర్‌కు లేదు

## మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్ 03 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు.

# బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుం డా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది.

# ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెం డు విభాగాలైన డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటివరకు 268మంది మావోయిస్టులు మరణించారు.

# రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.

# ఓయూలో విద్యార్థులకు పాడైన అన్నం

- విద్యార్థుల అందోళన కనువిప్పు కావాలి
- సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్ 03 :** మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేక పోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు.

# పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్‌లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదఅని కవిత వివరించారు

# మూగ బాలుడిపై కుక్కల దాడి

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. శీతాకాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు. స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

# భవిత కేంద్రాలతో దివ్యాంగుల మానసిక అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- భవిత కేంద్రం ప్రారంభం







చర్చ :- బ్యూరో కరీంనగర్ :భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగ పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.
తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల) జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక పద్ధతిలో విద్యా బోధన ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని తెలిపారు. చిన్న వయసులోనే భవిత కేంద్రంలో చేర్పిస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రుల అవసరం లేకుండానే సొంతంగా వారి పనులు చేసుకునే స్థాయికి చేరుకోగలరని అన్నారు. జిల్లాలో "దివ్య దృష్టి" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాలను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అక్కడ చదివే పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అధికారులకు, పాఠశాలలు, ఆసుపత్రుల సిబ్బందికి సైగల భాష నేర్పడం ద్వారా బధిరుల భావాలను వారు అర్థం చేసుకుంటున్నారని అన్నారు.
భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగుల కోసం జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల పాఠశాలలు, భవిత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగ విద్యార్థుల చదువుకు, వారి అభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్ర, ఎంఈఓ శ్రీనివాస్, డిఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలి

మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కొందరు విద్యార్థులు పాఠాలు సరిగ్గా చదవకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి రోజు పాఠాలు బిగ్గరగా చదవించాలని అన్నారు. బుధవారం భోదనలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలని, ప్రతి ఒక్కరితో పాఠాలు చదివించాలని ఆదేశించారు. విద్యార్థులు పట్టుదలతో నేర్చుకోవాలని, అర్థం కానీ సబ్జెక్ట్ ను ఉపాధ్యాయుల ద్వారా మరోసారి అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

# హిందు గాళ్లు బొందు గాళ్లు అన్నోళ్లు కాలగర్భంలో కలిసిపోయారు

- హిందూ వ్యతిరేకిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే గతి పడుతుంది...
- హిందూ దేవుళ్ళ గురించి హేళనగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కి ఇతర మతాల గురించి మాట్లాడే దమ్ము ధైర్యం ఉందా
- ఇతర మతాల మెప్పుకోసం రేవంత్ రెడ్డి పాకులాడుతున్నారు.
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి





చర్చ :- బ్యూరో కరీంనగర్ :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలే పరమావధిగా జీవిస్తున్నారని , తన రాజకీయ అవసరాల కోసం ఇతర మతాల మెప్పుకోసం హిందూ దేవుళ్లను ద్వేషిస్తూ, హేళనగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ వ్యతిరేక వ్యాఖ్యలపై బుధవారం రోజున బిజెపి జిల్లా శాఖ కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టింది.. ఇట్టి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ హిందువులను చులకన చేసి మాట్లాడారని , హిందుగాళ్లు , బొందు గాళ్ల నీ నాడు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు కాలమే సమాధానం చెప్పిందన్నారు. కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు హిందూ సమాజం తగిన బుద్ధి చెప్పిందని, నేడు ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ బాటలోనే నడుస్తున్నారని , అందుకే హిందూ సమాజం తో పెట్టుకుం టున్నారని ఘాటుగా విమర్శించారు. మూడు కోట్ల దేవతలంటూ .. ఒక్కో దేవుని పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. హిందూ దేవుళ్ళ గురించి వ్యాఖ్యలు చేసినట్టు ఇతర మతాల దేవుళ్ళ గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడే దమ్ము ధైర్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూ ద్వేషిగా మారారన్నారు. హిందూ దేవుళ్ళతో , హిందూ సమాజంతో పెట్టుకుంటున్న రేవంత్ రెడ్డి గత కెసిఆర్ లాగే కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రోగ్రాం కు ముందు కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో కూడా గంగాడి కృష్ణారెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్,వాసాల రమేష్,కళ్లెం వాసుదేవరెడ్డి, గువ్వల శ్రీనివాస్,కటకంలోకేష్, జోన్ ప్రెసిడెంట్,పాదం శివరాజ్, బండారు గాయత్రి,తణుకు సాయి కృష్ణ, అవదుర్తి శ్రీనివాస్ నరహరి లక్ష్మారెడ్డి, ఆవిడల చైతన్య, నాంపల్లి శ్రీనివాస్, ప్రసన్న, యువ క్రాంతి, అక్షయ్, కట్ట రాజు, ప్రసాద్,బోయిన్ శ్రీను,జి రవి,అనిష్,పాశం తిరుపతి,ఆకుల నరేష్, అజయ్, వెంకటేష్,సందీప్, శ్రీధర్,అనిల్,విజయ్, కలికోట మోహన్, నారాయణ, జిత్తు, నవీన్,మరియు తదితరులు పాల్గొన్నారు

# ఐక్యమత్యంతో గ్రామపంచాయతీని ఏకగ్రీవం చేసుకున్న గిరిజనులు







చర్చ:-అశ్వారావుపేట :నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా స్థానిక ఎన్నికలలో తమ ఐకమత్యం చాటారు ఒక గ్రామ గిరిజనులు మేము ఏ పార్టీకి ఓటు వెయ్యం అంటూ తమలో తామే నిర్ణయించుకుని పంచాయితీ పాలకవర్గాన్ని ఎన్నుకుని ఏకగ్రీవం చేసేసుకున్నారు అది ఎక్కడో కాదు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం అనే గ్రామంలో స్థానిక ఎన్నికల్లో రామన్నగూడెం గ్రామపంచాయతీనిఆదివాసీలందరూ కలిసి ఐకమత్యంగా ఏకగ్రీవం చేసుకున్నారు. కేవలం 347 ఓటర్లు ఉన్న ఆ గ్రామ పంచాయతీలో ఆరు వార్డులు ఉన్నాయి. ఏళ్ల తరబడి అన్ని రకాల రాజకీయ పార్టీలను నమ్ముకుని వారి వెనకాలే తిరిగి తిరిగి అలసిపోయామని అయినప్పటికి తమకు గాని తమ సమస్యలకు గాని ఏ విధంగానూ అక్కరకు రావడంలేదని విసుగుచెంది ఆదివాసీలు తమకు ఏపార్టీ జెండా వద్దని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సర్పంచ్ స్థానంతో సహా 6 వార్డులకు ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకుని ఏడుగురు నామినేషన్లు అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఏళ్ల తరబడి వేచి చూస్తూనే ఉన్నామని, ఇంకా ఓపిక నశించి ఇక తమను తమ పంచాయతీని తామే స్వయంగా రక్షించుకుంటామని గ్రామస్తులంటున్నారు. ముఖ్యంగా తాము ఎదుర్కొంటున్న పోడు భూమల సమస్యను ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులకు స్థానిక నాయకులకు విన్నవించుకున్న తమ సమస్యను ఎవ్వరు పట్టించుకున్న పాపన పోవడం లేదని ఈసారి మా పంచాయతీ ఏకగ్రీవం చేసుకుంటున్నాము కనుక ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకున్న పంచాయతీకి ప్రభుత్వం ప్రకటించిన నజరాన మాకు ఇవ్వాలని వాటితో మా గ్రామంలో మౌలిక వసతులు మాకున్న సమస్యలను తీర్చుకుంటామని గ్రామంలో నెలకొన్న అంతర్గత రహదారులు కాని డ్రైనేజిలు కాని నిర్మాణం చేసుకుని మా గ్రామ పంచాయితీని ఆదర్శ పంచాయతీగా రూపుదిద్దుకుంటామని అన్నారు.

# అధికార మార్పిడి జరిగితేనే చర్ల మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి సాధ్యం - కొండా చరణ్




చర్చ భద్రాద్రి కొత్తగూడెం :చర్ల మండల కేంద్రంలోని బిఎస్పి మండల కార్యాలయంలో బిఎస్పి చర్ల సెక్టర్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొండా చరణ్ హాజరయ్యారు ఈ సందర్భంగా కొండ చరణ్ మాటల్లాడుతూ చర్ల మేజర్ గ్రామపంచాయతీకి బిఆర్ఎస్ గాని కాంగ్రెస్ గాని చేసిందేమీ లేదని అన్నారు బిఆర్ఎస్ అయినా కాంగ్రెస్ అయినా దోచుకోవడంలో దాచుకోవడంలో ఐక్యం గా ముందున్నారని అన్నారు చర్ల మేజర్ గ్రామపంచాయతీలో జరిగే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ కూటమి కాంగ్రెస్ పార్టీకి బీ టీం గా పనిచేస్తుందని ఈ కుట్రలను ప్రజలు గమనించాలని తెలిపారు కాంగ్రెస్ నీ చర్ల మేజర్ గ్రామపంచాయతీ లో గెలిపించడం కోసం బిఆర్ఎస్ కూటమి పాకు లాడుతుందని ఆరోపించారు ఎని న్కల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు బీసీ లకు రిజర్వేషన్లు ఇవ్వకుండా మోసం జేసిన తీరుని బీసీ సామాజిక వర్గం గుర్తుంచుకోవాలని బీసీ సామాజిక వర్గం చర్ల మేజర్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నీ ఓడించి కర్రు కాల్చి వాతాపెట్టాలని అన్నారు చర్ల పంచాయితో కాంగ్రెస్ గెలిచినా బిఆర్ఎస్ గెలిచినా ఏమాత్రం మార్పు ఉండదని అన్నారు కాంగ్రెస్ జడ్పిటిసిగా ఉన్న హయాంలో చర్ల పంచాయతీలోని హాస్పటల్ నీ కొయ్యూరుకు తరలించే ప్రయత్నం చేసిన విషయాన్ని ప్రజలు గుర్తుచేసు కోవాలని అన్నారు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్ల మండల అభివృద్ధికి కృషి చేస్తున్న
బహుజన సమాజ్ పార్టీ బలప రిచిన అభ్యర్థి శ్రీమతి గుర్రాల దుర్గాభవాని ని చర్ల మేజర్ గ్రామ పంచాయతీ ప్రజలు ఆశీర్వదించి తమ అమూల్యమైన ఓట్లు వేసి అత్య ధిక మెజారిటీతో గెలిపించాలని తద్వారా చర్ల మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు పడిగల వెంకట్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చెన్నై మోహన్ పార్టీ మండల కార్యదర్శి గుర్రాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ధనము విశ్వవర్ధనమై వర్ధిల్లాలి

- శ్రీ సరస్వతీ శిశు మందిర్ కొత్తగూడెం కు లక్ష రూపాయలు అందజేసిన
- ఖమ్మం విభాగ్ అధ్యక్షులు దేవకీ వాసుదేవ రావు
- మానవ విజ్ఞానానికి విశ్వరూపమే చదువుబి



కొత్తగూడెం :శ్రీ సరస్వతి విద్యాపీఠం ఖమ్మం విభాగ్ అధ్యక్షులు దేవికి వాసుదేవరావు శ్రీ సరస్వతి శిశు మందిర్ కొత్తగూడెం పాఠశాల అభివృద్ధి పనులకు గాను బుధవారం లక్ష రూపాయలు అందజేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించుటలో శిశు మందిరాలు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యాసంస్కర్తలు, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధను కలిగి ఉన్న విద్యార్థుల భవితవ్యానికినికి పాఠశాల వారీగా గుర్తించి స్కాలర్షిప్ల ప్రకటించే దిశగా సంఘసంస్కర్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుండే దేశభక్తిని పెంపొందించే దిశగా పాఠశాల ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు మాతృభాషలో విద్యార్థి మాట్లాడినట్లుగా ,హిందీ ఇంగ్లీష్ భాషలో పరిజ్ఞానం వచ్చే విధంగా ఆచార్యులు ప్రాథమిక తరగతుల స్థాయి నుండి కృషి చేయాలని ఆయన ఆచార్యులకు సూచిం చారు. విద్యార్థులకు విద్యాధనం విశ్వ వర్ధనమై వర్ధిల్లాలని, ఆ దిశగా ఆచార్యులు కృషి చేయాలని ఆయన ఆచార్యులకు సూచించారు ఈ సందర్భంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రబం ధకారిణి కమిటీ ,పాఠశాల ప్రధానాచార్యులు స్రవంతి , ఆచార్యులు,అభినందనలు తెలియజేశారు

# కాంగ్రెస్ కి స్వపక్షంలోనే ప్రతిపక్షం







చర్చ:- అశ్వారావుపేట :స్థానిక ఎన్నికల నామినేషన్లు రసవత్తరంగా ముగిశాయి. అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా 5 మండలాల్లో కలిపి 102 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం తో పూర్తయింది. అందులో ఒక్క అశ్వారావుపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తవగా అందులో ఐదు గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ తరపున రెబల్స్ బరిలో దిగారు. అనంతారం, గాండ్ల గూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ఆశావాహులు తమకు అధిష్టానం ఆశీస్సులు లభించక పోవడంతో అందులోనే రెబల్స్ గా నామి నేషన్లు వేశారు. సొంత పార్టీ వారే తిరు గుబాటు దిశగా నామినేషన్లు వేయడమే కాకుండా ఎమ్మెల్యే సహా ముగ్గురు మంత్రులకు జేజేలు పలుకుతూ నామినేషన్ వేయడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. మరోపక్క సొంత పార్టీ వాళ్లే తమ లో తాము ఒకరిపై ఒకరు పోటీకి దిగడంతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు తలనొప్పిగా మారింది. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్నట్టు ఎమ్మెల్యే జారే ఎవ్వరికి ఏమి చెప్పలేక ఎవ్వరికి ఏమి చెప్తే ఎవ్వరు పార్టీకి దూరం అవుతారో అని భయపడే పరిస్థితికి వచ్చింది. ఇలా ఎవ్వరికి వారు నామినేషన్లు వెయ్యడం
అనేది కాంగ్రెస్ పార్టీలో ఎలాం టి విబేధాలకు దారితీస్తుందో అని ఆలోచనలో పడ్డారు. ఏది ఏమైనప్పటికి స్థానిక ఎన్నికలలో ఎలాగైనా అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకునే దిశగా ఎవ్వరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

## రుద్రంపూర్ ఆర్ సి ఓ ఏ క్లబ్ నందు కొత్తగూడెం ఏరియా జిఎం శాలెం రాజు ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న గుర్తింపు సంఘం ఏఐటియుసి సహాయ కార్యదర్శి జె.గట్టయ్య







చర్చ, సింగరేణి కొత్తగూడెం :బుధవారం ఉదయం డిసెంబర్ 3 ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రంపూర్ ఆర్ సి ఓ ఏ క్లబ్ నందు దివ్యాంగులకు జిఎం శాలెం రాజు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుర్తింపు సంఘం ఏఐటియుసి సహాయ కార్యదర్శి జె.గట్టయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాలి విద్య, ఉద్యోగం, క్రీడలు, మరియు ఇతర సామాజిక కార్యకలాపాలలో దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యం అని అన్నారు, అదేవిధంగా దివ్యాంగుల పట్ల ఉన్న అపోహలను, భయాలను తొలగించి, వారిని సమాజంలో ఒక భాగంగా అంగీకరించేలా ప్రజలలో అవగాహన పెంచాలి,మరియు దివ్యాంగులు తమకున్న పరిమితులను అధిగమించి, ఎన్నో విజయాలు సాధించగలరని,వారికి ఆత్మవిశ్వాసం కల్పించి, ప్రోత్సహించాలి. ఈ కార్యక్రమం లో కార్పొరేట్ జిఎం పర్సనల్ కిరణ్ కుమార్,సేవ కమిటీ అధ్యక్షురాలు మధురవాణి,తాతిదారులు పాల్గొన్నారు.

# అడవి జంతువులను వేటాడడానికి తయారు చేసిన నాటు బాంబును కొరికి కుక్క మృతి

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దు : ఎస్పీ రోహిత్ రాజు




చర్చ భద్రాద్రి కొత్తగూడెం :కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ పై ఉల్లిగడ్డ ఆకారంలోని నాటుబాంబును కొరికి ఒక కుక్క మృతి చెందడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని చెత్త పడేసే ప్రదేశం నుండి ఒక కుక్క తినే పదార్థంలా భావించి అడవి జంతువులను వేటాడటానికి తయారుచేసిన నాటుబాంబును రైల్వే ట్రాక్ మీదకు తీసుకువచ్చి కొరకడంతో అది ప్రేలి కుక్క అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని ఎస్పీ వివరించారు.నాటు బాంబులను చెత్తలో పడేసిన వ్యక్తుల గురించి పోలీసులు విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ ఘటనలో మరేవిధమైన కోణం లేదని ఎస్పీ నిర్ధారించారు.కావునా ఎవరూ కూడా సోషల్ మీడియాలో ఈ విషయంపై తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.

గురువారం,
డిసెంబర్ 04, 2025
నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్





చర్చ, సత్తుపల్లి:గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. తల్లాడ మండలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలన్నారు.

## పాఠశాల విద్యార్థుల తాగునీటికి సింగరేణి జి.ఎం సాయం...



చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారం గ్రామం ప్రాథమిక పాఠశాలలో బోరు బాయి మోటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గత కొద్దిరోజులుగా విద్యార్థులు త్రాగునీరు లేక అవస్థ పడడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండా ప్రభుదాసు లేఖ ద్వారా తమ సమస్యను సత్తుపల్లి ఏరియా సింగరేణి జి.ఎం చింతల శ్రీనివాస్ కు తెలియపరిచారు. స్పందించిన జి.ఎం సిబ్బందిని ఆదేశించి 10 వేల రూపాయల విలువ కలిగిన మోటర్, సంబంధించిన సామాగ్రిని పాఠశాలకు అందించారు. తమ పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చిన జి.ఎం కీ కృతజ్ఞతగా సహచర సిబ్బంది, విద్యార్థులతో కలిసి జి.ఎం కార్యాలయంలో చింతల శ్రీనివాసరావు, సహకరించిన సిబ్బందిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.


## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం : బుధవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బుధవారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, పొలిటికల్ పార్టీ నోముల రమేష్ బిజెపి, లక్ష్మణ అగర్వాల్ కాంగ్రెస్ పార్టీ, హమ్ ఆప్ ది పార్టీ అవుటుపల్లి రాంబాబు, సిపిఎం పార్టీ ఎండి. సలీం ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న %×ఙూజ% సమావేశ మందిరంలో బుధవారం రోజు ప్రైవేటు ఆసుపత్రులు మరియు డయాగ్నస్టిక్ సెంటర్ల వైద్య సిబ్బందికి పోర్టల్ వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, పోర్టల్‌లో సింద్రామిక్ సర్వైలెన్స్‌కు సంబంధించిన 22 సింద్రోములు మరియు 33 వ్యాధుల వివరాలను ప్రతిరోజూ కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సంబంధిత అన్ని ప్రైవేటు ఆరోగ్య సంస్థలు ఈ మార్గదర్శకాలను అచ్చం అమలు చేయాలనీ ఆదేశించారు. అలాగే అమలు విధానాలపై కూడా పూర్తి వివరాలు తెలియజేశారు.జిల్లాలో సిజేరియన్ శస్త్రచికిత్సల శాతం తగ్గించే చర్యలను తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డాక్టర్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి, ఎపిడమాలజిస్ట్ ఇమ్మాన్యుయేల్, శ్రీను, కుమారస్వామి, మరియు వివిధ ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌ల వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## ఎన్నికలకు సహకరించండి

- సత్తుపల్లి ఎం. వి. ఐ శ్రీనివాసరావు
- స్కూల్ బస్ యాజమాన్యాలతో రవాణా శాఖ అధికారులు.





చర్చ, సత్తుపల్లి:మూడవ విడతలో భాగంగా సత్తుపల్లి డివిజన్లో ఈనెల 17వ తేదీన జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు స్కూల్ బస్సులు సమకూర్చి సహకరించాల్సిందిగా సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్( వెహికల్స్ నోడల్ ఆఫీసర్) జె. ఎన్. శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన స్థానిక ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఎం .వి .ఐ రాజశేఖర్, ఏ. ఎం. వి. ఐ రాజశేఖర్ రెడ్డి లతో కలసి సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, సింగరేణి మండలాలకు చెందిన స్కూల్ బస్సులు కలిగిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారితో సమావేశం నిర్వహించారు.ఈ మండలాల పరిధిలో గల మొత్తం 160 వరకు స్కూల్ బస్సులు వివరాలు తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది, సామాగ్రి తీసుకువెళ్లడం, తిరిగి తీసుకు రావడానికి 16, 17 తేదీలలో బస్సులు అందుబాటులో ఉంచాల్సిందిగా కోరారు. ఎన్నికల నిర్వహణను తమ బాధ్యతగా భావిస్తూ దీనికి సహకరిస్తామని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు వారు రవాణా అధికారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల సంఘ నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, ఇస్మాయిల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు అండగా ఉంటాం

- ఉన్నత చదువులు చదివేలా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం
- ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్ళను కేటాయిస్తాం
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






చర్చ :- బ్యూరో కరీంనగర్ :దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.
దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బదిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని వివరించారు.

దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని.. ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు
ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.దివ్యాంగులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్ ను ఆవిష్కరించారు.కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు.

**దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ**

మన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.
సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని.. చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు.

**వయో వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ**

మన రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న చర్యలను అభినందించారు.

**దివ్యాంగుల కోపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ**

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో ఇప్పటికీ స్వయం సహాయక



సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.
సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని డిసిబిసి భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు.
సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

**బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం**

హైదరాబాదులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, మా శాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు, అది చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు.

## ఎన్నికల శిక్షణా కేంద్రాలను పరిశీలించిన సాధారణ పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పర్యవేక్షణకు నియమితులైన పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి బుధవారం జిల్లాలోని పలు మండలాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం చోటుచేసుకోకుండా అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచనలు జారీ చేశారు. ముందుగా ఆయన ఆర్వోలు ఏ ఆర్ ఓ ల శిక్షణ కేంద్రాలను సందర్శించారు. పరిశీలనలో భాగంగా పాల్వంచ మండలంలోని అనుబోస్ కాలేజీలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేసి, శిక్షకులు ఇస్తున్న మార్గదర్శకాలు, శిక్షణ పాఠ్యాంశాలు, హాజరు రికార్డులు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. అనంతరం బర్గంపహాడ్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , భద్రాచలం మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి అందజేస్తున్న నామినేషన్ ప్రక్రియ, కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల రోజున చేపట్టాల్సిన వివిధ విధులపై శిక్షణ నాణ్యతను సమీక్షించారు. శిక్షణా కేంద్రాల్లో మౌలిక వసతులు, సమృద్ధిగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, "గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవి. ప్రతి ఆర్వో , ఏ ఆర్ ఓ లు ఎన్నికల సిబ్బంది చట్టబద్ధంగా తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలి అని అన్నారు. శిక్షణా దశలోనే అన్ని విధానాలు పూర్తిగా అవగాహన చేసుకుని తర్వాత క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలి. చిన్న తప్పిదం కూడా ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి చర్యలో జాగ్రత్త వహించాలి" అని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని సూచనలు, మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తదుపరి నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పరిశీలకులు లక్ష్మీదేవిపల్లి మండలంలోని జీపీ లక్ష్మీదేవిపల్లి, జీపీ శ్రీనగర్ కాలనీ అలాగే సుజాత్‌నగర్ మండలంలోని జీపీ సీతంపేట బంజారా, జీపీ సర్వారం కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రత, సిబ్బంది హాజరు, క్యూలైన్ వ్యవస్థ మొదలైన అంశాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని పరిశీలకులు తెలిపారు. ఈ పర్యనల్ లో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకులందరూ సమన్వయంతో పని చెయ్యాలి

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- బీ.ఆర్.ఎస్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ వెళ్ళండి
- దమ్మపేట పంచాయతీ కొట్టాల్సిందే
- దమ్మపేట పంచాయతీ ఎన్నికల ఇంచార్జ్ గా దారా మల్లికార్జునరావు






చర్చ, దమ్మపేట :గత ప్రభుత్వం బీ.ఆర్.ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల కేంద్రంలో పంచాయతీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల వేళ అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీ.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా దమ్మపేట పంచాయతీ ఎన్నికల ఇంచార్జ్ గా మాజీ వైస్ ఎంపిపి దారా మల్లికార్జునరావుని మెచ్చా ప్రకటించారు. అలాగే సర్పంచ్ మరియు వార్డు మెంబర్ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బీ.ఆర్.ఎస్ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందని. దమ్మపేట పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం, కోర్టు ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు మంజూరు, వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్, హెల్త్ సబ్ సెంటర్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వాటన్నిటిని ప్రజలకు వివరించడంతో పాటు మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసిన మోసాలను కూడా ప్రజలకు తెలియజేయాలని. 2 ఏండ్లుగా గ్రామాలను ఎందుకు ఎండబెట్టారో ఎన్నికలు రాగానే గ్రామాలమీద ఎందుకు ప్రేమ పుట్టుకొచ్చిందో ప్రజలకు అర్థం అవుతుందని. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే సిట్ మరియు స్టాండ్ తప్ప ఇంకేమి ఉండదని ఎద్దేవా చేశారు. అదే బీ.ఆర్.ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే గల్లా పట్టి పనులు చేపిస్తారని. స్థానిక నాయకులు కూడా సమన్వయంతో కలిసి మెలిసి విభేదాలకు తావు లేకుండా కష్టపడి పని చేసి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.
అనంతరం సీనియర్ నాయకుడు యార్లగడ్డ ఏసు బాబు తండ్రి యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఇటీవలే స్వర్గస్థులు అవడంతో వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, మండల బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ రమేష్, మాజీ వైస్ ఎంపిపి దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ బాబు, గాజుబోయిన ఏసుబాబు, యార్లగడ్డ శ్రీను, పాకనాటి శ్రీను, పసుమర్తి రామ్ భద్రం, రూపా రాంబాబు, శేషాద్రి, సున్నం శ్రీను, భవాని, సాయి, ఆనంద్, రాజు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని





చర్చ :- బ్యూరో కరీంనగర్ :రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730 నామినేషన్లు, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2174 నామినేషన్లు దాఖలు అయ్యాయని చెప్పారు. రెండో విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888, 1046 వార్డు సభ్యుల స్థానాలకు 3056 నామినేషన్లు దాఖలు అయినట్టు వెల్లడించారు. నామినేషన్ వేయని సర్పంచ్ లేదా వార్డు సభ్యుల స్థానాలు ఇప్పటివరకు లేవని తెలిపారు. 125 వార్డు స్థానాలకు ఒకే ఒక నామినేషన్ దాఖలు అయినట్లు వెల్లడించారు. 2946 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. 19 శాతం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైన గుర్తించి పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 635 మందిని బైండోవర్ చేశామని, 33 లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు, ఎన్ డి పి ఎస్ చట్టం కేసు ఒకటి నమోదైనట్లు వెల్లడించారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి క్షేత్రస్థాయిలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్, సిపితో పాటు అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి కి నివాళులర్పించిన తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సభ్యులు



చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 3, (మంగపేట) :స్వరాష్ట్ర సాధన కోసం తెలంగాణ మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన అమరుడు శ్రీకాంతాచారి పదహారవ వర్ధంతి సందర్భంగా ఆ వీరుడికి ఘన నివాళులు అర్పించిన మంగపేట మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు. ఈ సందర్భంగా మంగపేట మండల అధ్యక్షులు గాదె శ్రీనివాస్ మాట్లాడుతూ 2009 డిసెంబర్ 3 న తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన తొలి అమరుడు అని అతని త్యాగం వెలకట్టలేనిదని కొనియాడాడు. శ్రీకాంతాచారి వర్ధంతి కార్యక్రమాన్ని కమలాపురం అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా' 'ఉద్యమకారులకు" న్యాయ మైన గుర్తింపు ఇవ్వాలన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో పునాది రాళ్లుగా ఉన్న ఉద్యమకారులకు ఇప్పుడున్న ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారులకు, కవులకు అప్పుడు వార్తలు అందించిన మీడియా మిత్రులకు కళాకారులకు ఒక్కొక్కరికి 10 లక్షలు రూపాయల ఆర్థిక సాయం కూడా ప్రకటించాలి.ఉద్యమకారులకు పింఛన్, ఇంటి స్థలం, వైద్యం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉద్యమకారులు కోరుతున్నారు. అదేవిధంగా డిసెంబర్ 3నీ ఉద్యమకారుల దినోత్సవం గా ప్రభుత్వం ప్రకటించి అధికారికంగా ఈ కార్యక్రమం ప్రభుత్వమే చేసి ఈరోజు సెలవు దినంగా ప్రకటించాలని కోరుతున్నాము.ఈ కార్యక్రమంలో టి యు ఎఫ్ మండల కన్వీనర్ గాదె శ్రీనివాస చారి. కో కన్వీనర్ ఈదునూరి రవీందర్. జిల్లా ఉపాధ్యక్షులు .కుంట ఏడుకొండలు. గౌరవ అధ్యక్షులు. పప్పు వెంకట్ రెడ్డి. చిలకమర్రి రాజేందర్. కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు .ఎస్.కె కుర్బాన్ అలీ.బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు. తుక్కాని శ్రీనివాస్ .చీకుర్తి సుధాకర్ .గు డిసేవ నాగేశ్వరరావు. గూడా వాసుదేవ మూర్తి .మండల రవీ ందర్ .చల్లా గరుగుల తిరుపతి .పగడాల వెంకట్ రెడ్డి .గంగుల శ్రీనివాస్ .దంతనపల్లి నరేందర్. చిలకమర్రి లక్ష్మయ్య. గోస్కుల లక్ష్మి .అనురాధ .ఝాన్సీ .తదితరులు పాల్గొన్నారు.

# నల్లా సర్వేకు నేపథ్యంలో ప్రజల నుండి వస్తున్న వివిధ రకాల సందేహాలు





చర్చ :- కరీంనగర్ :నల్లా సర్వేకు నేపథ్యంలో ప్రజల నుండి వస్తున్న వివిధ రకాల సందేహాలు ఫిర్యాదుల కోసం నగరపాలక సంస్థ ఇన్ వార్డు ఆవరణలో ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం రోజు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అభివృద్ధి పనులతో పాటు అమృత్, స్వచ్ఛభారత్ మిషన్, అమృత్ మిత్ర, నల్లా కనెక్షన్ సర్వే, విద్యుత్ మీటర్ సర్వే తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. స్మార్ట్ సిటీ లో చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనులు, అమృత్ పథకం, అమృత్ మిత్ర, వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్, అమృత్ మిత్ర నిధుల సద్వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి పలు సూచనలు చేస్తూ... అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ లో చేపట్టిన స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులతో పాటు వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర వ్యాప్తంగా డివిజన్ల వారిగా చేస్తున్న నల్లా కనెక్షన్ సర్వేను మరింత వేగవంతం చేయాలని... సర్వేను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. నీటి సరఫరా నల్లా కనెక్షన్ సర్వే నేపథ్యంలో ప్రజల నుండి వస్తున్న వివిధ రకాల సందేహాలు, ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కోసం నగరపాలక సంస్థ పౌరసేవ కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిఈ స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్ వ్యవరిస్తూ... ఏఈ, వర్క్ ఇన్ స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ నోడల్ ఆఫీసర్ కంట్రోల్ లో విధులు నిర్వహిస్తూ... ప్రజల నుండి వచ్చే నల్లా కలెక్షన్ సందేహాలు, ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నల్లా కనెక్షన్ సర్వే నేపథ్యంలో ప్రజలు ఎలాంటి సందేహాలు , ఫిర్యాదులు ఉన్న ప్రత్యేక కౌంటర్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈలు సంజీవ్ కుమార్, శివానంధం, డీఈలు దేవేంధర్, లచ్చిరెడ్డి, అరుణ్, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, ఏఈలు పాల్గొన్నారు.

# అతివేగం ప్రాణాలను హరించింది

- డివైడరును కారు ఢీకొని ముగ్గురు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద ఘటన
- మృతదేహాలు సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలింపు











చర్చ, సత్తుపల్లి:అతివేగం ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద బుధవారం ఉదయం 5 గంటలకు జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెనుబల్లి నుంచి సత్తుపల్లి వైపు అతివేగంగా వచ్చిన కారు కిష్టారంలోని అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద రాష్ట్రీయ రహదారిపై డివైడరును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ముగ్గురు మృత్యువాతకు గురయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా మారింది. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సాదిక్ (21), సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన సిద్దేసి జాయ్ (21), మర్సకట్ల శశి వర్ధన్ (12) అక్కడికక్కడే మృతి చెందారు. అన్నపురెడ్డిపల్లికి చెందిన తలారి అజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. చంద్రుగొండ
మండలం మహాబాద్ కాలనీకి చెందిన ఎస్కే ఇమ్రాన్ కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అజయ్ ను, ఇమ్రాన్ ను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. మృతి చెందిన ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి తరలించారు. డివైడరును ఢీకొట్టిన కారు నుజ్జునుజ్జయి శకలాలు 50 మీటర్ల దూరం వరకు చెల్లాచెదురుగా పడ్డాయి. ఏసీపీ వసుంధర యాదవ్, సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ఐలు ప్రదీప్, అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ సంఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
ఈ ప్రమాద దృశ్యాన్ని వారంతా కంటతడి పెట్టారు. ప్రమాద విషయం తెలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

# ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" తో సైబర్ నేరాల నియంత్రణ

- అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా చేయడమే పోలీసుల ప్రధాన లక్ష్యం : ఎస్పీ రోహిత్ రాజు
- జిల్లా పోలీస్ కార్యాలయంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పోస్టర్ల ఆవిష్కరణ



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంచేందుకు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు,జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో 42 రోజులపాటు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజు తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు,ఇతర పోలీస్ అధికారుల సమక్షంలో సైబర్ నేరాల నివారణ కొరకు రూపొందించిన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పోస్టర్లను జిల్లా ఎస్పీ విడుదల చేశారు.06 వారాల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే సైబర్ నేరాల నివారణ అవగాహన కార్యక్రమాల్లో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల అధికారులు, సీఐలు,డీఎస్పీలు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ అశోక్,సిఐ జితేందర్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ సీహెచ్.శ్రీనివాస్,ఇ.శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,ఎస్సైలు రాజమౌళి,శ్రీను లు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం

- తదుపరి చర్యలకు రంగం సిద్ధం.
- నామినేషన్ల పరిశీలన. టెన్షన్ లో అభ్యర్థులు.

చర్చ:- అశ్వారావుపేట :నియోజకవర్గ వ్యాప్తంగా స్థానిక ఎన్నికల వేళ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోను ఎటువంటి అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా నామినేషన్ల ప్రక్రీయ ముగిసింది. రెండవ విడత నామినేషన్స్ ప్రక్రియలో భాగంగా అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో నవంబర్ 30 వ తేదీ ఆదివారం నుండి మంగళవారం అర్ధరాత్రి వరకు నామినేషన్స్ ప్రక్రీయ కొనసాగుతూనే ఉంది. రెండవ విడతలొ భాగంగా 7 మండలాల్లో 156 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు మరియు 1392 వార్డు స్థానాలకు అభ్యర్థుల నుండి నామినేషన్స్ తీసుకోవడం జరిగింది. అదేవిధంగా అశ్వారావుపేట నియోజకవర్గం చూసుకుంటే నియోజకవర్గంలో ఉన్న 5 మండలాలు అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, మండలాల వ్యాప్తంగా 102 పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులుగా, 942 వార్డులకు వార్డ్ అభ్యర్థుల కొరకూ నామినేషన్లను స్వీకరించడం జరిగింది.అశ్వారావుపేట మండలంలో 27 పంచాయతీ లకు గాను సర్పంచ్ పదవికి 145 నామినేషన్లు దాఖలు కాగా వార్డు పదవికి 529 నామినేషన్లు దాఖలు చేశారు. దమ్మపేట మండలంలో 31 పంచాయతీ లకు గాను సర్పంచ్ పదవికి 146 నామినేషన్లు, వార్డు పదవికి 652 నామినేషన్లు దాఖలు చేశారు. ములకలపల్లి మండలంలో 20 పంచాయితీ లకు గాను సర్పంచ్ పదవికి 114 నామినేషన్లు, వార్డు పదవికి 469 నామినేషన్లు దాఖలు చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో 10 పంచాయతీ లకు గాను సర్పంచ్ పదవికి 43 నామినేషన్లు, వార్డు పదవికి 273 నామినేషన్లు దాఖలు చేశారు. చంద్రుగొండ మండలంలో 14 పంచాయతీ లకు గాను సర్పంచ్ పదవికి 74 వార్డు పదవికి 388 నామినేషన్లు దాఖలు చేశారు. మొతంగా నియోజకవర్గ వ్యాప్తంగా సర్పంచ్ పదవికి 522 వార్డు పదవికి 2311 నామినేషన్లను అభ్యర్దులు దాఖలు చేశారు.అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం పంచాయతీ పాలకవర్గం మొత్తం ఏ పార్టీకి సంబంధం లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడింది. అలాగే చంద్రుగొండ మండలంలోని గుంపేనా, ఊటుపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడంతో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఎన్నుకోబడినవి.మిగిలిన పంచాయతీ లలో 14 డిసెంబర్ తేదీన ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకుని సర్పంచ్ మరియు వార్డు సభ్యులను ఎన్నుకుంటారు. అదే రోజున ఫలితాలు కూడా వెల్లడించడం కూడా జరుగుతుంది. ఏది ఏమైనా స్థానిక ఎన్నికల్లో ఎవ్వరి కలలు నిజమవ్వానున్నాయో ఎవ్వరు పీఠం అధిష్టించనున్నారో వేచి చూడాల్సిందే.

# సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు





చర్చ:- అక్కన్నపేట్: మండలంలోని మల్లంపల్లి గ్రామంలో సర్పంచ్ స్థానానికి బరిలో నిలిచిన టేకుల సునీత సంపత్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామస్తులకు రుణపడి ఉంటాను అని గ్రామ అభివృద్ధికి పాటుపడతానని సునీత పేర్కొన్నారు గ్రామంలో మౌలిక వసతులైన సిసి రోడ్లు వీధి దీపాలు హైమాస్ లైట్లు పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్ల బండ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా యాటకర్ల రాజు తన అనుచరులతో బుధవారం నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీళ్ల బండ దుగుట్టపల్లి యాటకారులపల్లె గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడుతానని తమను ప్రజలు ఆశీర్వదించి ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు.

# మీకు వైట్ టీ గురించి తెలుసా..

## దీన్ని తాగితే అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు



ఆరోగ్యంగా ఉండాలని చెప్పి చాలా మంది గ్రీన్ టీ, బ్లాక్ టీ, పెప్పర్మింట్ టీ వంటి అనేక రకాల టీలను తాగుతుంటారు. అయితే చాలా మందికి వైట్ టీ కూడా ఉంటుందనే విషయం తెలియదు. ఇతర హెర్బల్ టీల మాదిరిగానే వైట్ టీ కూడా మనకు మార్కెట్లో లభిస్తుంది. దీన్ని కూడా ఆకుల నుంచే తయారు చేస్తారు. కమేలియా సైనెన్సిస్ అనే మొక్క ఆకుల నుంచి వైట్ టీని తయారు చేస్తారు. అయితే సాధారణ తేయాకులను పూర్తిగా ఆక్సీకరణ చెందిస్తారు. కనుకనే అవి నలుపు రంగులోకి మారుతాయి. ఇక గ్రీన్ టీ ఆకులను ఉడికిస్తారు. కానీ. వైట్టీ ఆకులను మాత్రం ఎండబెడతారు. అందువల్ల ఇవి పూర్తిగా సహజసిద్ధమైనవని చెప్పవచ్చు. సాధారణ టీ, గ్రీన్ టీ ఆకుల కన్నా వైట్ టీ ఆకులు అత్యంత సహజసిద్ధమైన స్వభావాన్ని కలిగి ఉంటాయి. కనుక వైట్ టీ మన ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని రోజూ తాగడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు.వైట్ టీని రోజూ సేవించడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా కాటెకిన్స్ అని పిలవబడే పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. వైట్ టీని తాగడం వల్ల అత్యధిక మోతాదులో యాంటీ ఆక్సిడెంట్లను పొందవచ్చు. ఇవి మన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ టీని సేవించడం వల్ల పాలిఫినాల్స్ అధిక మొత్తంలో లభించి రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీని వల్ల రక్త నాళాల వాపులు తగ్గి రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ టీ ఎంతో మేలు చేస్తుంది. ఈ టీని సేవించడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు సైతం తగ్గుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

# హుస్నాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన





## ప్రజా పాలన విజయోత్సవాలు

చర్చ: హుస్నాబాద్: పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.262.78 కోట్లతో శంకు స్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన
రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ఏర్పాటుకు శంకుస్థాపనరూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనరూ. 8.60 కోట్లతో యూనిట్ ఆఫీస్ శంకుస్థాపన.
రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్-కొత్తపల్లి ప్యాకేజీ-1 లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన.రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన
ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు
మంత్రి పొన్నం ప్రభాకర్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ హుస్నాబాద్ కి ఇచ్చినందుకు , 250 పడకల ఆసుపత్రి, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, నాలుగు లైన్ ల రోడ్డు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు
రెండు సంవత్సరాల క్రితం ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందిఇదే గ్రౌండ్ లో ప్రియాంక గాంధీ గారి సభ కి వచ్చారుహుస్నాబాద్ గ్రామీణ ప్రాంత నియోజకవర్గంమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత 10 సంవత్సరాలుగా విధ్వంస పాలన జరిగిందిఅభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి గారికి చేదోడు వధోడు లా ఉండాలిగ్లోబల్ సమ్మిట్ దేశానికి కాదు ప్రపంచ దేశాలకి వన్నె తెస్తుందిఉమ్మడి జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఎన్నికల తరువాత ముఖ్యమంత్రి గారు ప్రారంభిస్తారు.ఉత్తర తెలంగాణ కి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.లక్ష కోట్లు వ్యవసాయానికి ఖర్చు చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతం విద్యా వ్యాప్తికి మరిన్ని మౌలిక వసతులు కల్పించండి. ఇక్కడ పాడి పశు సంపద అధికంగా ఉంటుంది. రైతులకు వ్యవసాయం పాల ఉత్పత్తి మీదనే ఆధారపడతారువారికి చేయూత అందించండి.హుస్నాబాద్ పట్టణం నాలుగు జిల్లాలకు మధ్యలో ఉంది.. హుస్నాబాద్ కి రింగ్ రోడ్డు ఇవ్వాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నగౌరవెల్లి ప్రాజెక్ట్ ఈ ప్రాంత రైతాంగానికి వర ప్రదాయిని గత 10 సంవత్సరాలుగా కుర్చీ వేసుకొని కడతామని ప్రగల్భాలు పలికారు అది అక్కడే ఉంది ప్రజా పాలన ప్రభుత్వం లోనే దానికి ముందు అడుగులు పడుతున్నాయిమీ నేతృత్వంలో వచ్చే సీజన్ లో గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా ప్రతి పల్లెకు నీళ్ళు అందించేందుకు మీరు చేస్తున్న కృషికి ధన్యవాదాలు.హుస్నాబాద్ నుండి హైదరాబాద్ కి ఎక్స్ ప్రెస్ బస్సు కు జెండా ఊపి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
ప్లాస్టిక్ మేనేజ్మెంట్ వెహికిల్ ను ప్రారంభించిన సీఎం 70 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు సైకిల్ లు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిహుస్నాబాద్ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది సర్దార్ సర్వాయి పాపన్న నేతృత్వంలో బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ ఇది తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజలు కీలక పాత్ర పోషించారు
అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని కరీంనగర్ వేదికగా సోనియమ్మ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు అరవై ఏళ్ల కల నెరవేర్చిన సోనియమ్మను కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానం అందించి ఇక్కడికి వచ్చా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ప్రధాని మోడీని కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించి వచ్చా
డిసెంబర్ 3 కు ఒక ప్రత్యేకత ఉంది.మీ ఓటును ఆయుధంగా మార్చి దుర్మార్గ పాలనను అంతమొందించి ప్రజా పాలనను తీసుకొచ్చిన రోజు ఇది తెలంగాణ కోసం శ్రీకాంత చారి అమరుడైన రోజు ఇది శ్రీకాంతాచారి ఆశయ సాధనలో భాగంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం రెండున్నరేళ్లు పూర్తి చేసుకునే లోగా మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం ఆరెస్ పాలనలో లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయింది కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదు
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతులకు రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేసి రుణ విముక్తులను చేశాం
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 1 లక్ష 4 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేశాం రూ. 8 వేల కోట్లు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఖర్చు చేశాం ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందించాం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం దాదాపు 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు హుస్నాబాద్ కు సాగునీరు అందించే గండిపెల్లి, గౌరెల్లి ప్రాజక్టులను పూర్తి చేయలేదు గత పాలకులు ప్రచారం మొదలు పెట్టేందుకు సెంటిమెంట్ గా హుస్నాబాద్ ను ఉపయోగించుకున్నారు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను అభివృద్ధి చేసుకున్నారు కానీ హుస్నాబాద్ ను అభివృద్ధి చేయలేదు
గత పాలకుల్లా మేం హుస్నాబాద్ ను నిర్లక్ష్యం చేయంఎన్ని నిధులైనా ఖర్చు చేసి హుస్నాబాద్ ను అభివృద్ధి చేస్తాంగత పదేళ్లలో బీఆరెస్ పేదలకు ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదు
పదేళ్లు ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉంటుంది పదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు కట్టిస్తాం రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి ఇవి మన గ్రామాల్లో వెలుగులు నింపే ఎన్నికలుసర్పంచ్ ఎన్నికల్లో మంచివాళ్లని ఎన్నుకోండి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసి అభివృద్ధి గ్రామాలను అభివృద్ధి చేసే వాళ్లను సర్పంచులుగా ఎన్నుకోండి

# ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

- అభివృద్ధి కార్యక్రమాల పేరిట రాష్ట్ర ముఖ్య మంత్రి హుస్నాబాద్ పర్యటనకు వస్తున్న సందర్భంగా
- హుస్నాబాద్ పోలీస్ లు బి ఆర్ యస్ బి జె పి మరియు ఏ బి వి పి నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది
- ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం
- అబద్ధాల ప్రచారం తోనే కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుంది.
- సర్పంచ్ ఎన్నికల కోసమే ముఖ్య మంత్రి బహిరంగ సభ .
- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంది.
- కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు
- పరిపాలన కొనసాగిస్తుంది.




చర్చ:- హుస్నాబాద్: బుధవారం రోజున : అభివృద్ధి కార్యక్రమాల పేరిట హుస్నాబాద్ పట్టణానికి వస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి కేవలం సర్పంచ్ ఎన్నికల ప్రచారం కోసమే వచ్చినట్లు స్పష్టంగా కనబడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని జిమ్మిక్కులు చేసిన ప్రజలు నమ్మరు అని తెలుపుతున్నాం గతం లోనే గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు అయినావి చెప్పి పట్టణం లో మరియు గ్రామాలల్లో పనుల కోసం శంకుస్థాపనలు చేసినారు వాటిని ఇప్పటికి కుడా ఇంకా కొన్ని పనులు ప్రారంభం కాలేదు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసిన పనులనే వాటినే తిరిగి గౌరవ ముఖ్య మంత్రి గారిచే శంకుస్థాపన చేయి స్తున్నారు ఇది కేవలం ప్రజలను మభ్య పెట్టడానికి కోసం బహిరంగ సభ నిర్వహించి ఉనికి చాటుకుంటున్నారు తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదు గౌరవ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ హంగామా ఆర్భాటాలు చేయడమే తప్ప నిజంగా హుస్నాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తపన లేదు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల గుండె చప్పుడు గౌరవెల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండు సంవత్సరాలకు గడుస్తుంది కనీసం తట్టేడు మట్టి కుడా తీయలేదు కానీ ప్రతి మీటింగ్ లల్లో మైకులు పట్టుకొని గౌరవెల్లి ప్రాజెక్టు గురించి మాట్లాడుతారు గత ప్రభుత్వం లోనే ప్రాజెక్టు పనులు దాదాపు 98 శాతం పనులు పూర్తి అయినా ఇంకా మిగిలిన కొన్ని పనులు కుడా పూర్తి చేయలేక పోతున్నారు ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం దాదాపు సంవత్సరం కిందనే 430 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది అని ప్రకటనలు చేసినారు కానీ నేటి వరకు కుడా కాలువల నిర్మాణం చేయడం కోసం భూ సేకరణ పూర్తి చేయలేదు కాలువల నిర్మాణం చేయకున్నా కనీసం ప్రాజెక్టు లో నీళ్లు నింపిన గ్రౌండ్ వాటర్ పెరిగే అవకాశాలు ఉండేవి కానీ పట్టించు కునే పరిస్థితి లేదు అదేవిధంగా పట్టణంలో ప్రతి వార్డు సి సి రోడ్ మరియు మురికి కాలువ నిర్మాణం కోసం 50 లక్షలు నిధులు మంజూరు చేసినావి చెప్పి వార్డు లో పనుల కోసం శంకుస్థాపనలు చేసినారు అవికూడా కొన్ని వార్డు ల్లో పనులు ప్రారంభం కాలేదు అదేవిధంగా పట్టణం లో 250 పడకల ఆసుపత్రి తీసుకొచ్చినాము అని చెప్పి గతం లో ఉన్న 150 పడకల ఆసుపత్రి భవనాన్ని కూల్చినారు కానీ వరకు అట్టి పనులు ప్రారంభించలేదు హుస్నాబాద్ ప్రాంతానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే వరద లాగా నిధులు తీసుక వస్తున్నాం అని గొప్పలు చెప్పుకొని కాలం గడుపుతున్నారు గతంలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో ప్రజలను నమ్మించి ఓట్లు వేయంచుకొని అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలన అని చెప్పుకుంటునే మరో పక్క ప్రజల కోసం పోరాడే ప్రతి పక్ష పార్టీ లపై కక్ష సాధింపులు కొనసాగిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వనిది ప్రజా పాలన కాదు కక్ష సాధింపు పాలన రాష్ట్ర లో కొనసాగిస్తుంది ఇప్పుడు జరిగే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ఓటమి భయం పట్టుకుంది కాబట్టే రాష్ట్ర ముఖ్య మంత్రి గారు అభివృద్ధి కార్యక్రమాల పేరిట జిల్లా ల బాట పట్టినారు ప్రజలను మభ్య పెట్టి సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులను గెలిపించాలని




తపనతో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారు అవసరం వచినప్పుడు తప్పకుండా కాంగ్రెస్ పార్టీ కి తగిన బుద్ది చెప్పుతారు అని తెలుపుతున్నాం పోలీసులు ముందస్తు అరెస్టు వారిలో బి ఆర్ యస్ బి జె పి మరియు ఏ బి వి పి నాయకులు బి ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు ఎమ్ ఏ అన్వర్ పాషా నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాజీ ఎమ్ పి పి ఆకుల వెంకట్ మాజీ జడ్ పి టి సి బీలు నాయక్ భూక్యా లక్ష్మణ్ నాయక్ కుడితాడి భాస్కర్ మునిముని బొల్లి శ్రీనివాస్ కాయిత రాజేందర్ రెడ్డి శివరాం మరియు బి జె పి పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తు ల శంకర్ బాబు దొడ్డి శ్రీనివాస్ మండల అధ్యక్షులు భూక్యా సంపత్ నాయక్ బొల్లి శ్రీనివాస్ వరియోగుల అనంత స్వామి వెల్ల డి సంతోష్ రాజేంద్ర ప్రసాద్ ఏ బి వి పి నాయకులు కంసాని రాకేష్ ,భీ మగోని చరణ్,చెన్నూరి రాజేష్, బత్తుల సంతోష్,బత్తుల రాజు ఉన్నారు.

# దివ్యాంగులు కూడా అందరితో సమాన అవకాశాలు పొందాలి

- జిల్లా అసిస్టెంట్ (ట్రైనీ)కలెక్టర్ సౌరబ్ శర్మ







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గౌరవ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) శ్రీ సౌరబ్ శర్మ , బుధవారం కొత్తగూడెం భవితా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలలో పాల్గొని, విజయం సాధించిన దివ్యాంగ బాల, బాలికలకు బహుమతులను అందజేసారు.సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు లభించేలా ప్రభుత్వం చేస్తున్న కృషిని తల్లిదండ్రులకు వివరించారు.ముఖ్యంగా అర్హత గల దివ్యాంగ్యులందరు కార్డులను పొందేలా, సంబంధిత సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లా జడ్జి శ్రీ రాజేందర్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ,భద్రాద్రి కొత్తగూడెం చుంచుపల్లి మండలం లోని భవితా కేంద్రాన్ని సందర్శించి, భవితా కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సేవలు, పునరావాస కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.
జిల్లా విద్యాధికారి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ, ఈ పిల్లలు చూపుతున్న ప్రతిభ, పట్టుదల, మనోబలం ప్రతి కుటుంబానికీ, సమాజానికీ ప్రేరణ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ లు యస్. కె. సైదులు, ఏ.నాగరాజ శేఖర్, ఎన్. సతీష్ కుమార్, మండల విద్యాధికారులు మధురవాణి, బాలాజీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, స్పెషల్ ఎడ్యుకేటర్ దుర్గా మాధవి, లిహారిక, భవితా కేంద్ర సిబ్బంది శ్రీరామ్, అరుణ కుమారి, సిద్దయ్య, సంతోష్ కుమార్, ప్రత్యేక శిక్షకులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# సమాచార భవన్ వద్ద జర్నలిస్టుల మహా ధర్నా

- సమస్యలపై ప్రభుత్వ మౌనం విచారకరం
- హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుంది









చర్చ, హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహంతో తెలంగాణ జర్నలిస్టులు బుధవారం సమాచార భవన్ ఎదురుగా చేపట్టిన మహా ధర్నా ఉద్రిక్తంగా కొనసాగింది. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మీడియా వర్గాలు ఏకతాటిపై నిలిచి తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశాయి. కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ ధర్నాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టీయూడబ్ల్యూజేఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాల రాజు, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి నేతృత్వంలో భారీగా తరలి వచ్చిన స్థానిక జర్నలిస్టులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రత, ఆరోగ్య బీమా, గృహ నిర్మాణ పథకాలు, అక్రెడిటేషన్ సులభీకరణ, గ్రామీణ రిపోర్టర్లకు సౌకర్యాల కల్పన, ప్రెస్ క్లబ్బుల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.“ప్రజాస్వామ్య నాల్గవ స్థంభాన్ని ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తున్నది” నాయకుల ఆగ్రహం
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ “ప్రజా స్వామ్యానికి నాల్గవ స్థంభంగా నిలిచే మీడియాను ప్రభుత్వం ఇప్పటికీ పట్టించుకోకపోవడం తీవ్రమైన అన్యాయం అన్నారు. మా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం వెంటనే కదలిక చూపాలని తెలిపారు. మా హక్కుల కోసం ఈ పోరాటం ఆగదు, మరింత ఉద్ధృతం అవుతుంది” అని హితవు పలికారు.
నినాదాలు, ప్లకార్డులతో ఉద్రిక్త వాతావరణం
ధర్నా స్థలమంతా నినాదాలు, బ్యానర్లు, ప్లకార్డులతో కిక్కిరిసిపోయింది. వివిధ జిల్లాల నుండి వచ్చిన రిపోర్టర్లు తమ స్థానిక సమస్యలను, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలు ఏళ్ల తరబడి వాయిదా పడుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల కాలం నుంచి కొనసాగుతున్న వాగ్దానాలు కూడా అమలు కాలేదని, ప్రెస్ క్లబ్బుల అభివృద్ధి, గృహ నిర్మాణాలు, పింఛన్లు వంటి అంశాలపై సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మీడియా మహా ధర్నా%
జర్నలిస్టుల ఐక్యతను ప్రతిబింబించే ఈ భారీ నిరసన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేసే జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ఇకపైనా విస్మరించకూడదని పలువురు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. జర్నలిస్టుల డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం కొనసాగుతుందని టీయూడబ్ల్యూజే నాయకత్వం స్పష్టం చేసింది.
మహా ధర్నా విజయవంతం కావడంతో ప్రభుత్వం స్పందించేనా?
రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి, నిరంతర పోరాటం నేపథ్యంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోబోతోంది అనేది ఆసక్తికర అంశంగా మారింది.

# ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కొర్రలు.. రోజూ తింటున్నారా

అశ్రద్ధ చేశారు. కానీ ప్రస్తుతం చాలా మందికి ఆరోగ్యం పట్ల ఇప్పుడు శ్రద్ధ పెరుగుతోంది. అందులో భాగంగానే ఆహారం, వ్యాయామం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోషకాలు కలిగిన ఆహారాలను రోజూ తినడంతోపాటు వ్యాయామం కూడా చేస్తున్నారు. ఈ క్రమంలోనే చాలా మందికి ఆరోగ్యం పట్ల జాగ్రత్త పెరిగింది. అయితే ఆరోగ్యంగా ఉండడం కోసం చాలా మంది అనేక ఆహారాలను తింటున్నారు కానీ మిల్లెట్లకు అంతగా ప్రాధాన్యాత ఇవ్వడం లేదు. మన పూర్వీకులు ఎక్కువగా వాటినే తినేవారు. కానీ ప్రస్తుతం కేవలం కొంత మంది మాత్రమే మిల్లెట్లను తింటున్నారు. అయితే ఆరోగ్యంగా ఉండాలంటే మిల్లెట్లను కచ్చితంగా రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొర్రలను రోజూ తినాలని వారు చెబుతున్నారు.కొర్రలు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత పురాతన కాలం నుంచి మానవునికి ఆహారంగా ఉంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కొర్రలను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు. కొర్రలతో జావ, ఉప్మా, అన్నం, రొట్టె వంటివి తయారు చేసి తినవచ్చు. కొర్రలను రోజూ తినడం వల్ల అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చని చెబుతున్నారు. కొర్రలు షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి చాలా తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటాయి. పైగా వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీని వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి కొర్రల వల్ల మేలు జరుగుతుంది. వీటిని రోజూ తింటుంటే ఉపయోగం ఉంటుంది. కొర్రలను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది కనుక జీర్ణ వ్యవస్థ



సైతం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది.జీర్ణ వ్యవస్థకు..కొర్రలు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. కనుక వీటిని తింటుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. కొర్రలను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభించి కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజూ తింటుంటే బీపీని ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొర్రల్లో ఉండే పొటాషియం రక్త నాళాలను సైతం ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటిల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని రోజూ తింటుంటే రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. కొర్రల్లో అధికంగా ఉండే మెగ్నిషియం కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

# సర్పంచ్ పదవి ఎస్టీకి రిజర్వ్ చేసిన అధికారులు




**నల్గొండ జిల్లా :** అనుమల మండలం పేరూరులో పంచాయతీ ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామంలో సర్పంచ్ పదవిని ఎస్టీకి రిజర్వ్ చేయడానికి నిరసనగా గ్రామస్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు. పేరూరు గ్రామంలో ఒక్క ఓటరు కూడా ఎస్టీ లేరు. అయినప్పటికీ ఆ ఊరి సర్పంచ్ పదవిని ఎస్టీకి రిజర్వ్ చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించారు. సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లు కూడా నామినేషన్లను బహిష్కరించారు. రిజర్వేషన్లు మార్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వారి వెంట నడుస్తాం



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే సమాజాన్ని నిర్మించేందుకు మనందరం ప్రతినబూనుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాడు కేసీఆర్ ప్రభుత్వంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికేలా వారి అభ్యున్నతి కోసం అనేక పథకాలను తీసుకొచ్చామని గుర్తుచేశారు.కేసీఆర్ ఆనాడు మానవత్వంతో కూడిన పరిపాలన అందించారని కేటీఆర్ తెలిపారు. దివ్యాంగులకు అత్యధికంగా రూ.4016 పెన్షన్ ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో ఒక ఆసరా పెన్షన్ ద్వారానే దాదాపు రూ. 10 వేల కోట్లు అందించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో 3% నుంచి 4% శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా అనేకమందికి సహాయ ఉపకరణాలు ఉచితంగా అందించామన్నారు. కానీ, అధికారం కోసం దివ్యాంగులకు రూ.6 వేల ఫించను, ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, బాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ లాంటివి ఆశ చూపి రెండేళ్లు అవుతున్నా దానిని అమలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం నినదిస్తుందని, సమస్యల పరిష్కారానికి వారి వెంట నడుస్తుందని భరోసా ఇచ్చారు.

# ఎందుకు సీఎం రేవంత్ రెడ్డి మాటల్ని వక్రీకరిస్తున్నారు



**ఢిల్లీ, డిసెంబర్ 3:** హైదరాబాద్‌లో నిన్న జరిగిన డీసీసీ నూతన అధ్యక్షుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్ని ఎందుకు వక్రీకరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రతీ విషయాన్నీ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు.హిందువుల్లో అనేక మంది దేవుళ్ళు, దేవతలు ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారు.. కులాన్ని, మతాన్ని ఇబ్బంది పెట్టే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడలేదని ఎంపీ స్పష్టం చేశారు. దీన్ని బీజేపీ,బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు.'తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నాయి.. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అన్ని ఎన్నికల్లో ఓడిపోయింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ దక్కలేదు. రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించి తెలంగాణ ప్రజల మనసుల్లో నెగిటివ్ అభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయని.. కాని తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలుసునని చామల అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో కార్యక్రమాలు చేస్తున్నారు.. మెస్సి లాంటి అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారుడిని తీసుకువచ్చి హైదరాబాద్ లో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడిస్తున్నారని.. ఇదంతా హైదరాబాద్ కీర్తిని ఇనుమడింపచేస్తుందని ఎంపీ చెప్పుకొచ్చారు.

# ప్రాథమిక స్థాయి విద్య పిల్లల భవిష్యత్‌కు మొదటి అడుగు



**నీలగిరి, డిసెంబర్ 03 :** ప్రాథమిక స్థాయి విద్య పిల్లల భవిష్యత్‌కు మొదటి అడుగు అని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె త్రిపురారం మండల కేంద్రంలో మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, హాస్టల్ సౌకర్యాలు పరిశీలించారు. బాలికలకు అందిస్తున్న సేవలపై ఉపాధ్యాయులతో చర్చించారు. స్కూల్ బిల్డింగ్‌ను రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. బాలికల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినిలతో మాట్లాడుతూ వారి పేర్లు, ఇష్టమైన విషయాలను అడిగారు. బాలికలతో మాట్లాడి వారికి నచ్చిన సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టి వారికి చాక్లెట్స్ పంపిణీ చేశారు.విద్యార్థులకు చదువు, ఆటలు, ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ అంశాలను తెలియజేశారు. బాగా చదివి తల్లిదండ్రులు, టీచర్లకు మంచి పేరు తేవాలని చెప్పారు. ఆడబిడ్డ చదువు ఇంటికి వెలుగని, బాలికలకు ప్రేమ, శ్రద్ధతో నాణ్యమైన విద్య అందించాలన్నారు. పిల్లల్లో పఠన, లేఖన నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన చిన్నపాటి మరమ్మతులను, సదుపాయలపై తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. కలెక్టర్ ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ రవికుమార్, ప్రిన్సిపాల్ భారతి ఉన్నారు.

# రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
# గాంధీ భవన్ వద్ద మోహరించిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 03:** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని పీసీసీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ




భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు..

# హయత్‌నగర్‌లో బాలుడిపై కుక్కల దాడి
## - చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్ నగరంలోని హయత్‌నగర్‌లో మూగబాలుడిపై కుక్కల దాడి ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. వీధికుక్కల కట్టడి కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ఒక్కసారిగా తరిమిన కుక్కల సమూహం : మంగళవారం 15 నుంచి 20 వీధి కుక్కలు ఒకేసారి దాడి చేయడంతో ప్రేమ్‌చంద్ అనే మూగ బాలుడు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. ప్రకాశం జిల్లాకు చెందిన సీహెచ్ తిరుపతిరావు, చంద్రకళ దంపతులు ఎల్బీనగర్ మన్సూరాబాద్ సమీపంలోని శివంగంగ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రేమ్‌చంద్ (చింటు) పుట్టుకతో మూగ. నిన్న ఉదయం ఇంటి నుంచి దుకాణంలో సరుకులు కొనుక్కోవడానికి వీధిలోకి వెళ్లినప్పుడు ఒక్కసారిగా కుక్కలు తరుముతూ అతడిపై దాడి చేశాయి.స్వెటర్ లేకపోయినా, ఆలస్యమైనా ప్రాణాలు పోయేవి : ప్రేమ్‌చంద్ దుస్తులను కుక్కలు కొరికేసి మరీ దారుణంగా కరిచాయి. శీతాకాలం కావడంతో ప్రేమ్‌చంద్ స్వెటర్ ధరించాడు. ఆ స్వెటర్‌ను నోటితో కరిచి పట్టుకున్న కుక్కలు బాలుడిని అమాంతం ఈడ్చుకెళ్లాయి. స్వెటర్ లేకుంటే బాలుడి ప్రాణాలతో ఉండేవాడు కాదు. మూగ వాడు కావడంతో కేకలు వేయలేక ప్రేమ్‌చంద్ నిస్సహాయంగా పడిపోయాడు. అది గమనించిన ఓ స్థానికుడు కర్రతో కుక్కలను బెదిరించి వాటిని తరిమికొట్టాడు. అనంతరం 108కు సమాచారం ఇచ్చారు.తొలుత బాలుడిని నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యుల సూచనతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ వార్డులో ఉంచి అతడికి ట్రీట్‌మెంట్ అందిస్తు న్నారు. ఈ ఘటనలో బాలుడి చెవి తెగిపోయింది. దానికి శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. తల, నడుము, వీపు భాగాల్లో ఘోరంగా తీవ్ర గాయాలయ్యాయి.



కాస్త ఆలస్యమైతే కుక్కల దాడిలో ప్రేమ్‌చంద్ ప్రాణాలు కోల్పో యేవాడని డాక్టర్లు తెలిపారు.చీఫ్ వెటర్నరీ అధికారి హాజరుకు న్యాయస్థానం ఆదేశం : వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సుప్రీంకోర్టు మార్గద ర్శకాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనం టూ ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేసి, టీకాలు వేసిన తరువాత వాటిని ఆశ్రయ కేంద్రాలకు తరలిం చాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈనెల 9న చీఫ్ వెటర్నరీ అధికారి వ్యక్తిగతంగా కానీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారాగానీ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.వీధి కుక్కల నియం త్రణలో న్యాయస్థానం మార్గదర్శకాలను అమలు చేయాలన్న వినతి పత్రాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ యానిమల్ షెల్టర్ అండ్ రెస్క్యూ ఎయిడ్ (ఆస్రా) సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలను విన్న తర్వాత రెండు యానిమల్ బర్త్ కంట్రోల్ సెంట ర్లను సందర్శించి మొబైల్‌తో చిత్రీకరించడానికి పిటిషనర్‌కు అనుమతించాలని, ఇందులో ఎలాంటి ఇబ్బందులు సృష్టించరాదంటూ విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేశారు.

# రవికి పోలీసులు బంఫర్ ఆఫర్

**హైదరాబాద్, డిసెంబర్ 03:** టెక్నాలజీపై ఉన్న పట్టుతో కొత్త సినిమాలను పైరసీ చేసి.. చిత్ర పరిశ్రమకు ఐ బొమ్మ రవి చుక్కల చూపించారు. అలాంటి రవికి పోలీసులు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అతడి తెలివితేటలను విచారణలో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. పోలీసు శాఖలోని సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తావా? అంటూ రవిని వారు అడిగినట్లు సమాచారం. మంచి జీతం సైతం ఇస్తామని అతడికి ఆఫర్ చేశారని తెలుస్తోంది. రవి మాత్రం వారి ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించారట.ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు అనేక కొత్త విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా 'ఐ బొమ్మ క్లోజ్ అయింది.




కదా.. తర్వాత ఏం చేస్తావంటూ' రవిని పోలీసులు ప్రశ్నించారు. కరేబియన్ దీవుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తానని వారికి చెప్పినట్లు సమాచారం.ఆ రెస్టారెంట్‌లో తెలంగాణ, ఆంధ్రా తోపాటు దేశంలోని వివిధ ప్రముఖ వంటకాలను ఆ దీవుల్లోని ప్రజలకు రుచి చూపించడం ద్వారా డబ్బు సంపాదిస్తానని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరి ఆ రెస్టారెంట్‌కు ఏం పేరు పెడతావంటూ రవిని పోలీసులు ప్రశ్నించగా.. ఐ బొమ్మ పేరే పెడతానని రవి ఈ సందర్భంగా పోలీసులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

# ఫ్యూచర్ సిటీ ఓ పెద్ద స్కామ్


**హైదరాబాద్:** పారిశ్రామికీకరణ వల్ల దెబ్బతిన్న దేశాలు చాలా ఉన్నాయని, మానవీయ కోణం లేకుండా ఏ అభివృద్ధి అయినా విధ్వంసానికి దారి తీస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఫ్యూచర్ సిటీ అనేది పెద్ద స్కామ్ అని, రాష్ట్ర ప్రభుత్వం హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిగ్నల్ టీవీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హిల్ట్ పాలసీ స్కీమా.. స్కామా అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ శివారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పారిశ్రామికీకరణ జరిగినంత మాత్రాన మానవ అభివృద్ధి జరగదని, ఇలాంటి అభివృద్ధితో ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.మానవ విలువలు, జీవన ప్రమాణాలు మెంగు పడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వానికి ఇండస్ట్రీ పాలసీ మీద స్పష్టత లేదని, పాశ్చాత్య అభివృద్ధి నమునాపై జాగ్రత్తగా ఆలోచించాలని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ 9 వేల ఎకరాలు హిల్ట్ పాలసీలో భాగంగా ఇతర అవసరాల కోసం కేటాయించారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో ఓ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. చండీగఢ్‌పై జరిగిన కుట్ర మాదిరిగా




కేంద్ర ప్రభుత్వం ఇతర నగరాలపై కూడా కన్నేసిందని ఆరోపించారు. రాజకీయ నాయకుల స్వార్థంతో హైదరాబాద్ నగరం పూర్తిగా నాశనం అయ్యే పరిస్థితి దాపురించిందని, బీజేపీ కూడా దీనికి సహకరిస్తున్నట్లు తెలుస్తున్నదని అన్నారు. పర్యావరణ వేత్త పాపారావు మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ అనేది పెద్ద స్కామ్ అని, సెంట్రల్ యూనివర్సిటీ భూములను కూడా సేకరించాలని చూశారని, సుప్రీంకోర్టు చీవాట్లు పెడితే ఊరుకున్నారని తెలిపారు. కాలుష్యంపై అవగాహన లేకుండా భూములు సేకరించాలని చూస్తున్నారని చెప్పారు. ఎంఎస్ఎంఈ జేఏసీ చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు భూముల అవసరమని, భూములు విక్రయిస్తారా? లీజుకు ఇస్తారా? అనేది ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ శైలేష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో రాజకీయాలన్నీ భూముల చుట్టే తిరుగుతున్నాయన్నారు.హిల్ట్ పాలసీ పెద్ద భూ దోపిడీ అని విమర్శించారు. బక్క జడ్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ తెచ్చిన ప్రతి పాలసీ దోపిడీ కోసమే, రేవంత్‌రెడ్డి ఆలోచనలన్నీ లాక్కోవడానికేనని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ నగరం రూపురేఖలు మార్చే హిల్ట్ పాలసీపై తొందర ఎందుకని, దీనిపై విస్తృత చర్చ జరగాలని అన్నారు. ఇన్ని వేల ఎకరాలు అన్యాక్రాంతం చేస్తుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని తెలిపారు. విస్తృత చర్చ లేకుండా ఈ పాలసీ ఎలా తెచ్చారని బీఆర్ఎస్ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రకాష్ రెడ్డి, మర్రి ప్రభాకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

# రేవంత్ సర్కార్ అంటే అప్పులు చేయడం ప్రభుత్వ భూములు అమ్మడం

**హైదరాబాద్:** రేవంత్ సర్కార్ అంటే అప్పులు చేయడం, ప్రభుత్వ భూములు అమ్మడం అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు కాంగ్రెస్ విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. ఈ నేపథ్యంలో మౌలాలి ఇండస్ట్రియల్ ఏరియాలో బీఆర్ఎస్ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే మర్రి నిరసన దీక్షలు చేపట్టారు. తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హిల్ట్ పాలసీని రద్దు చేయాలని నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను మధుసూదనాచారి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ సంపదను రేవంత్ రెడ్డి దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌కు అనేక కంపెనీలు క్యూ కట్టాయని



పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో ప్రపంచంతోనే పారిశ్రామికరంగంలో పోటీపడ్డామని గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నారని అన్నారు.తెలంగాణకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ జాతిని అవమానించడమే కాంగ్రెస్ విధానమని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలను నరకం చూస్తున్నారని అన్నారు. కమీషన్ల కోసం ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కప్పం చెల్లించడం కోసమే రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు రాహుల్ గాంధీ లాంటి అమాయకులు కాదని.. రేవంత్ మోసాలు గమనిస్తున్నారని అన్నారు.

# ఏపీలో స్క్రబ్ టైఫస్ అలర్ట్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలను స్క్రబ్ టైఫస్ వ్యాధి వణికిస్తోంది. ఈ వ్యాధి బారిన పడిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల వారం వ్యవధిలోనే ఏడు కేసులు నమోదయ్యాయి. విజయనగరం జిల్లాలో ఈ వ్యాధి బారిన పడి రాజేశ్వరి అనే మహిళ మృతిచెందడంతో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్క్రబ్ టైఫస్ తీవ్రత పెరగకముందే.. ఈ వ్యాధి బారిన పడిన వారికి చికిత్స అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం (డిసెంబర్ 2) రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ వల్ల రాజేశ్వరి అనే మహిళ మృతిచెందడం గురించి ప్రస్తావించిన సీఎం.. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కీటకాలు కుట్టడం వల్ల చనిపోయే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఈ పురుగుల బారిన పడకుండా.. ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు.కాగా, విజయనగరం



జిల్లాలో రాజేశ్వరి అనే మహిళను చిగ్గర్‌మైట్ అనే కీటకం కుట్టిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ తర్వాత ర్యాపిడ్ పరీక్ష చేయగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలిందని చెప్పారు. స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదని.. ఈ కీటకం కుడితే శరీరంపై దద్దుర్లు, పుండ్లు ఏర్పడతాయని తెలిపారు. అధిక జ్వరం, చలి, తీవ్ర తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయని వెల్లడించారు. సకాలంలో చికిత్స అందిస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదని వివరించారు. అయితే ప్రభావిత ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా.. కీటకాలు కుట్టిన వెంటనే వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారుఇలా చేయకుంటే ప్రమాదం!స్క్రబ్ టైఫస్ వ్యాధి రాకుండా ఉండాలంటే.. ముందుగా లార్వల్ మైట్స్ (%శ్రీ%పురుగులను దగ్గరికి రానివ్వొద్దు. అందుకోసం ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి. ఇంట్లో పొడి వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. తడిసిన దుస్తులు ధరించొద్దు. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను వేసుకోవాలి. పంట పొలాల్లో పనిచేసేటప్పుడైనా, ఇంట్లో ఉన్న సమయంలోనైనా ఏదైనా పురుగు కుట్టినట్లు అనిపిస్తే.. వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయినా.. నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉండే ప్రజలు జాగ్రత్తగా పాటించాలని సూచిస్తున్నారు.

# పన్నుల వసూళ్లకు సమానంగా ఏపీకి పంపిణీ



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా సేకరించిన ప్రత్యక్ష పన్నులు, స్థూల జీఎస్టీ వసూళ్ల మొత్తం రూ.111.75 లక్షల కోట్లు కాగా.. ఆ కాలంలో రాష్ట్రాలకు పన్ను పంపిణీ, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపేణా కేంద్రం బదిలీ చేసిన మొత్తం రూ.75.12 లక్షల కోట్లు అని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో సీపీఎం సభ్యుడు జాన్ బ్రిటాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ నుంచి రూ.3.32 లక్షల కోట్లు వసూలు కాగా, కేంద్రం ఏపీకి రూ.3.23 లక్షల కోట్లు బదిలీ చేసిందన్నారు. ఏపీలో వసూళ్లకు దాదాపు సమానంగా కేంద్రం నుంచి నిధులు బదిలీ అయ్యాయని పంకజ్ చౌదరి వివరించారు.

# ఆర్థిక కారిడార్ అమరావతి



**అమరావతి :** రాజధాని అమరావతి ఎకనామిక్ కారిడార్‌గా అవతరించబోతోంది. ఇటీవల సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అమరావతి ఎకనామిక్ జోన్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు, త్వరలో ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలుంటాయి. ఈ నేపథ్యంలో అమరావతి ఎకనామిక్ కారిడార్‌కు త్వరలోనే రూపకల్పన జరగనుంది. విజన్ ప్రణాళికలు రూపకల్పన జరిగి కార్యరూపం దాల్చితే అమరావతి ఎకనామిక్ కారిడార్ రాష్ట్రానికే తలమానికంగా మారుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా అమరావతి ఎకనామిక్ కారిడార్ కార్యకలాపాల పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించనుంది. ఈ కారిడార్ రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉండనున్న దృష్ట్యా ప్రధానంగా ఫైనాన్స్, డీప్ టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సంస్థలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. రాజధానిలో ఇప్పటికే క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. మరోవైపు అమరావతిలో ఆర్థిక నగరాన్ని నిర్మించేందుకు ఇటీవలే అంకురార్పణ జరిగింది.దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజున 15 జాతీయ బ్యాంకులు, బీమా కంపెనీలు రీజినల్ కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశాయి. కంపెనీలు కూడా త్వరలోనే వాటి కార్యాలయాల నిర్మాణాలను ప్రారంభించనున్నాయి.

# జగన్ హయాంలో భూ రికార్డులు తారుమారు సీఎం చంద్రబాబు ఫైర్

**తూర్పుగోదావరి జిల్లా, డిసెంబరు3 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. (బుధవారం) తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్లలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ప్రసంగించారు సీఎం చంద్రబాబు.వైసీపీ హయాంలో భూములు కబ్జా చేయడానికి 22ఏ విధానం.వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశువులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరిం చాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.వ్యవసాయం ద్వారా ఆరు శాతం ఆదాయం.'వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ.



వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నదులను అనుసంధానం చేస్తాం. 'జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుస ంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయా లని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థి తుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# వివేకా హత్య కేసు కోర్టు ఏం చెప్పబోతోంది కొనసాగుతున్న హైటెన్షన్



**కడప, డిసెంబరు3 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో () సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో () ఆయన కూతురు సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం) న్యాయస్థానం విచారణ చేసింది. ఈ క్రమంలో సునీత వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అవడంతో తీర్పును రిజర్వ్ చేసింది సీబీఐ కోర్టు. ఈ నెల 10వ తేదీన తీర్పు వెల్లడించనుంది సీబీఐ కోర్టు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపించేలా సీబీఐకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలంటూ సునీత న్యాయవాదులు వాదనలు వినిపించారు.తన తండ్రి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలైన వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు సునీత. ఇదే కేసులో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు సునీత తరుపు న్యాయవాది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపితే ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు సునీతారెడ్డి.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి

హైదరాబాద్ : ఏపీ డిప్యూటీ సీఎం పదవికి పవన్ కళ్యాణ్ అనర్హుడని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ విమర్శించారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లా పర్యటన సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా, ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినప్పటికీ.. ప్రజలు కలిసే ఉన్నారని నారాయణ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమార్తెను ఏపీలోని భీమవరం ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన



తొలిరోజుల్లో తనకు చేగువేరా ఆదర్శమని చెప్పాడని.. ఇప్పుడు సావర్కర్‌ను భుజాన వేసుకుని సనాతన ధర్మం అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. సనాతన ధర్మం కోసం తిరగాలని అనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని.. కాకపోతే రాజకీయాలను వదిలేసి ఆ పనిచేసుకోవాలని హితవుపలికారు.దిష్టి తగిలింది వంటి మాటలు మాట్లాడే సనాతనవాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని నారాయణ వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగదని పేర్కొన్నారు. తక్షణమే పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఏపీలో ఎన్నికల హడావుడి.షెడ్యూల్ విడుదల



**అమరావతి, డిసెంబరు3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం ఇవాళ(బుధవారం) సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర?యాలు తీసుకున్నారు.ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంక్రటామిరెడ్డి ప్యానెల్ పదవీ కాలం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలను ఈ నెల(డిసెంబరు) 23వ తేదీన నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర?యం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అప్సా కార్యవర్గం ప్రకటించింది. తొమ్మిది కేటగిరీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సచివాలయం, అసెంబ్లీతో కలిపి 1200 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

# రైతన్నా మీ కోసం రెట్టింపు చేయడమే లక్ష్యం

**శ్రీ సత్య సాయి :** రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలు ప్రతి రైతు వరకు చేరాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమమే "రైతన్నామీ కోసంఈ అవగాహన కార్యక్రమం ఈ రోజు కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట మండలం కురుమామిడి పంచాయతీ రెక్కమాను రైతు సేవ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద మాట్లాడుతూ ప్రభుత్వం దీర్ఘకాలిక దూరదృష్టితో రూపొందించిన పంచసూత్రాలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యమని తెలిపారు.నూతన విధానాలు, ఆధునిక సాంకేతికత, తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు, పంట భీమా, నీటి వినియోగ సమర్థత వంటి అంశాలను రైతులు అవలంబిస్తే.. వ్యవసాయం మళ్లీ లాభదాయక రంగమవుతుందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాలు రైతుల సమస్యలకు పరిష్కార వేదికగా మారాలనేది ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.రైతు




కుటుంబాలన్నింటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా "రైతన్నా మీ కోసం" కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామని ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో నేరుగా రైతు ఇంటికే వెళ్ళి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, రైతు సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరేలా అంకితభావంతో పని చేస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు పంచసూత్రాల్లోని కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా 1. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి పద్ధతులు. 2. ఆధునిక సాగు విధానాలు, డ్రిప్‌స్ప్రింక్లర్ టెక్నాలజీ, 3. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల అందు బాటు 4. పంటలకు మార్కెట్ హామీ, ధరల స్థిరీక రణ, 5. రైతు భీమా, సహాయక పథకాల ప్రయో జనాలు, వీటి పై విపులంగా రైతులకు సూచనలు ఇచ్చారు.వర్క్‌షాప్‌లో పాల్గొన్న రైతులు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలపై సానుకూల స్పందన వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అభ్యర్థించారు. పంటల సమస్యలు, కొనుగోలు విధానాలు, పంట నష్ట పరిహారం, నీటి అందుబాటు వంటి అంశాల పై కూడా రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతుసంఘం నాయకులు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు. గ్రామస్థాయిలో రైతుల ఆర్థిక స్థితి మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టిన "రైతన్నా%8౯% మీ కోసం" రైతుల్లో చైతన్యాన్ని పెంపొందిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీశైలం దేవస్థానం మరో కీలక నిర్ణయం వారికి ఉచిత స్పర్శ దర్శనం

**నంద్యాల, డిసెంబరు3 :** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇరుముడి కలిగిన శివస్వాములకు మాత్రమే ఉచిత స్పర్శ దర్శనం కల్పించాలని నిర్ణయించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ వరకు సాధారణ భక్తులకు స్పర్శ దర్శనాన్ని రద్దు చేసింది దేవస్థానం. శివస్వాములకు మాత్రమే విడతల వారీగా స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 7వ తేదీ వరకు సాధారణ భక్తులకు స్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఇచ్చింది.ఆన్‌లైన్ ద్వారా భక్తులు భారీగా



స్పర్శదర్శనం కోసం నమోదు చేసుకుంటున్నారు. భక్తులు భారీగా తరలివస్తుండటం, మరోవైపు శివస్వాములు కూడా మాల తీయడానికి ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో స్పర్శ దర్శనానికి సమయం పడుతోంది. ఈ క్రమంలోనే ఇరుముడి కలిగిన శివస్వాములకు మాత్రమే స్పర్శ దర్శనం కల్పించాలని దేవస్థానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అయితే, భక్తులకు అల్పాహారాలు, తాగునీరు, తదితర వసతులను ఎప్పటికప్పుడు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

# బీజేపీ రాష్ట్ర చీఫ్ ఆసక్తికర కామెంట్స్



**చెన్నై:** వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ విజయాన్ని సాధిస్తుందని, అన్నాడీఎంకే తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. మదురైలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, మతవాదాన్ని గట్టిగా నమ్ముతున్న బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నందు వల్ల అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడదని డీఎంకే అసత్యప్రచారాలు చేస్తోందని,వాస్తవానికి రాష్ట్రంలో కమలం పార్టీ అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడాలని తాము ఆశిస్తున్నామని, పలు చీలికలుగా విడిపోయిన ఆ పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందన్నారు. మాజీ బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు అన్నామలై ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగా పార్టీ ప్రారంభించబోరని, ఆయన బీజేపీతో సన్నిహితంగానే ఉన్నారన్నారు.

# విజయ్ రోడ్‌షోకు అనుమతి నిరాకరణ



'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్() ఈ నెల 5వ తేదీ పుదుచ్చేరి()లో చేపట్టదలచిన రోడ్‌షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. టీవీకే వినతిపత్రాన్ని పరిశీలించిన ఐజీ అజిత్‌కుమార్‌సింగ్ అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపట్ల టీవీకే శ్రేణులు, విజయ్ అభిమానులు తీవ్ర నిరాశతో వున్నారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం పోలీసుల వైఖరిని సమర్థించారు.విజయ్‌కు అనుమతివ్వకపోవడం మంచిదేనని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చిన్ననగరమైన పుదుచ్చేరిలో రోడ్‌షో నిర్వహిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, తమిళనాడులో లాగా ఇక్కడ పెద్దరోడ్లు లేవన్నారు. అవసరమైతే విజయ్ ప్రైవేటుగా ఓ మైదానాన్ని ఎంపిక చేసి అందులో సభ జరుపుకోవడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

# ఢిల్లీ కళాశాలలకు బాంబు బెదిరింపులు



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ లో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నగరంలోని రెండు కళాశాలలకు బుధవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టారు.ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రెండు కళాశాలలకు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నార్త్ క్యాంపస్‌లోని రాంజాస్ కళాశాల, కల్కాజీలోని దేశ్‌బంధు కళాశాలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులను, సిబ్బందిని బయటకు పంపి సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టుల మృతి



**ఛత్తీస్‌గఢ్ :** రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.మన్యంలో టెన్షన్ వాతావరణం.మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రస్తుతం మన్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల మారేడుమిల్లి ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్ల ప్రభావం ఇంకా తగ్గలేదు. ఇలాంటి సమయంలో మంగళవారం నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్‌జీవో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. దీంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన కొనసాగుతోంది.

# పాక్ ఆరోపణలపై భారత్ కౌంటర్- శ్రీలంకకు గడువు తీరిన పదార్థాలు పంపి దాయాది నవ్వులపాలు

దిత్వా తుపాను ప్రభావంతో కష్టాల్లో ఉన్న శ్రీలంకకు పంపే మానవతాసాయం విమానాలపై పాకిస్థాన్? చేస్తున్న విమర్శలను భారత్ తిప్పికొట్టింది. సహాయక పదార్థాలతో శ్రీలంకకు వెళ్తున్న విమానానికి భారత్ అనుమతి ఇవ్వలేదంటూ పాకిస్థాన్ ఆరోపణలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఖండించారు. పాకిస్థాన్ ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తెలిపారు. పాకిస్థాన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఆయన, భారత వ్యతిరేక ప్రచారంలో ఇదొకటని అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్? చేసిన విజ్ఞప్తిని కేవలం కొన్ని గంటల్లోనే పరిష్కరించమని తెలిపారు. 2025 డిసెంబర్ 1 మధ్యాహ్నం ఒంటిగంటకు విజ్ఞప్తి చేయగా, మానవతా సాయం దృష్ట్యా అదే రోజు సాయంత్రం 5. 30 గంటలకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో శ్రీలంకకు మద్దతుగా నిలవడంలో భారత్ ఎప్పుడూ అండగా ఉంటుందని మరోసారి తెలిపారు. కాగా, శ్రీలంకకు పంపే విమానాలకు ఎయిర్ క్లియరెన్స్ ఇవ్వకుండా 60 గంటల పాటు ఆపేసిందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. సహాయార్థం గడువు తీరిన పదార్థాలు పంపిన పాక్‌మరోవైపు దిత్వా తుపాను ప్రభావంతో కష్టాల్లో ఉన్న శ్రీలంకకు సహాయంగా గడువు తీరిన పదార్థాలు పంపి పాకిస్థాన్ నవ్వులపాలయింది. కొలంబోకు పంపించే ప్యాకేజీలకు సంబంధించిన



ఫోటోలను పాక్ హైకమిషన్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకుంది. ఆ చిత్రాలను పరిశీలించగా ప్యాకెజీలపై 10 వ తేదీ 2024తో వాటి గడువు ముగిసినట్టు లేబుల్ కనిపించింది. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గడువు తీరిన పదార్థాలను సహాయార్థం ఇచ్చినందుకు సోషల్ మీడియాలో పాక్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ చర్యల ద్వారా శ్రీలంకను పాక్ అవమానపరిచిందని నెటిజన్లు మండిపడ్డారు. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై ఇప్పటివరకూ పాకిస్థాన్ స్పందించలేదు.శ్రీలంకలో 465కు చేరిన తుపాను మృతుల సంఖ్యమరోవైపు శ్రీలంకలో దిత్వా తుపాను మృతుల సంఖ్య 465కు చేరింది. ఈ విపత్తులు, వరదల ధాటికి మరో 366 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో అనేక ప్రాంతాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని సూచించారు. సుమారు 3లక్షల మంది చిన్నారులపై ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపినట్లు యునిసెఫ్ అంచనా వేసింది. తుపాను కారణంగా వరదలతో శ్రీలంకలో అల్లకల్లోలం కాగా, పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి భారీ నష్టం వాటిల్లింది. సహాయ, పునరుద్ధరణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే అనేక దేశాలు శ్రీలంకకు మానవతా సహాయం, సరకులు పంపుతున్నాయి. భారత్ సైతం శ్రీలంకకు మానవతా సహాయం కోసం ఆపరేషన్ సాగర్ బంధు చేపట్టింది. వాయు, సముద్రం మార్గంలో 53 టన్నుల సరకులు పంపింది భారత్. అత్యవసర సమయాల్లో భారత్ ప్రముఖ పాత్ర పోషించిందని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే కార్యాలయం ప్రకటించింది. క్లిష్ట సమయంలో శ్రీలంక ప్రజలకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా పేర్కొంది.

# విమాన ప్రయాణాల కోసం రోజుకు రూ.21 లక్షలు ఖర్చు చేస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం

**భోపాల్:** విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణం కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నది. విమానయాన బిల్లు రోజుకు రూ.21 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతాప్ గ్రేవాల్, పంకజ్ ఉపాధ్యాయ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 2021 జనవరి నుంచి 2025 నవంబర్ వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రైవేట్ వైమానిక ఆపరేటర్లకు అత్యధికంగా రూ. 90.7 కోట్లు చెల్లించింది.కాగా, జనవరి 2024 నుంచి నవంబర్ 2025 వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.143 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 23 నెలల్లో నెలకు దాదాపు రూ. 6.2 కోట్లు లేదా రోజుకు సగటున రూ. 20-21 లక్షలు వ్యయం చేసింది. దీనికి ముందు మూడు ఏళ్లల్లో 2021 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వం రూ.147 కోట్లు ఖర్చు చేసింది. అంటే నెలకు దాదాపు రూ. 4.1 కోట్లు లేదా రోజుకు సగటున రూ.13 నుంచి రూ.14 లక్షలు వ్యయమైంది.మరోవైపు 2019లో మధ్యప్రదేశ్ రాష్ట్ర



విమానాల అద్దె వ్యయం ఏటా రూ.1.63 కోట్లు ఉన్నది. అయితే 2025 నాటికి అది రూ.90.7 కోట్లకుపైగా పెరిగిందని సీఎం మోహన్ యాదవ్ అంగీకరించారు. కోవిడ్ తర్వాత పర్యాటకంతోపాటు విమానాల డిమాండ్ పెరుగడం, లోక్‌సభ ఎన్నికలు, ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు తీవ్రంగా పెరుగడం వంటి కారణాల వల్ల అద్దె రేట్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. దీంతో ప్రైవేట్ విమానం, హెలికాప్టర్ ఛార్జీలు 20-30 శాతం పెరిగాయి. 2022-23లో గంటకు రూ.4.45 లక్షలుగా ఉన్న ధరలు 2024లో రూ.5.70 లక్షలకు పెరిగాయి. కొన్ని సంస్థల హెలికాప్టర్ ధరలు గంటకు రూ.5.29 లక్షలకు చేరుకున్నాయి.2021 మేలో కూలిపోయిన ఆ రాష్ట్ర ప్రభుత్వ విమానం గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో నిలిచిపోయింది. నాలుగేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రైవేట్ విమానయాన సం స్థలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీని ఫలితంగా ఖర్చులు పెరుగుతున్నాయని వెల్లడించింది. అయితే గ్రౌండ్ చేసిన ప్రభుత్వ విమానాలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం ఎం దుకు మరమ్మతులు చేపట్టలేదని ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రశ్నించింది. గత 20 ఏళ్లలో రాష్ట్ర అప్పు 16 రెట్లు పెరిగి రూ. 20,000 కోట్ల నుంచి రూ. 4.64 లక్షల కోట్లకు పెరుగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు ఏటా రూ. 27,000 కోట్లు వడ్డీకే చెల్లిస్తుండటంపై అసెంబ్లీలో మండిపడింది.

# సంచార్ సాథీతో సైబర్ ఫ్రాడ్‌ల నుంచి రక్షణ

**న్యూఢిల్లీ:** సైబర్ మోసాల బారిన పడకుండా నిరోధించే ఏకైక మార్గం 'సంచార్ సాథీ' అప్లికేషన్ అని అని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారంనాడు తెలిపారు. భారత్‌లో విక్రయించే ఫోన్లలో ఈ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడం, ఇది ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెట్టడమే అవుతుందని అభ్యంతరాలు చెబు తున్న నేపథ్యంలో మంత్రి తాజా వివరణ ఇచ్చారు. 'స్నూపింగ్ యాప్ అని చెబుతున్న ఎవరికైనా ఒక మాట చెప్పదలచుకున్నాను. దయచేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. మీఅంతగా మీరు క్షుణ్ణంగా పరిశీలించండి. సైబర్ నేరాలను నిరోధించేందుకు చాలా తక్కువ మార్గాలు ఉన్నారు. నా అభిప్రాయంలో సైబర్ నేరాలను నిరోధించేందుకు ఇదొక్కటే మార్గం. యాప్‌ను ప్రీ-



ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరా కాదా అనేది వేరే విషయం. తమ ఆదేశాలను పునఃపరిశీలిస్తామని ప్రభుత్వం, సింధియా వివరణ ఇచ్చారు. విద్యాధికుల సమాచారం సేకరించడం, దానిని పేదలు, వృద్ధులకు సాయపడేందుకు ఉపయోగించడం ఈ యాప్ లక్ష్యం' అని చంద్రశేఖర్ చెప్పారు.20 కోట్ల వెబ్‌సైట్ హిట్లుఅన్ని వాడుకభాషల్లోనూ యాప్ పనిచేస్తుందని మంత్రి తెలిపారు. సంచార్ సాథీ వెబ్‌సైట్‌ను ఒకసారి చూసినట్టయితే ఈ వెబ్‌సైట్‌కు 20 కోట్ల వెబ్‌సైట్ హిట్లు వచ్చాయని, 1.4 కోట్ల మంది ఇప్పటికే ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. యాప్ స్టోర్‌లో కనిపించడానికి ముదు యాపిల్, గూగుల్ సైత యాప్‌ను వెరిఫై చేసినట్టు తెలిపారు. ఎవరైనా యాప్ వద్దనుకుంటే దాన్ని డిలీట్ చేయవచ్చని, అయితే యాప్ ఆలోచన మంచిదని, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంత్రి సూచించారు

# విపక్షాల నిరసనలతో- సంచార్ సాథీ యాప్ పై వెనక్కి తగ్గిన కేంద్రం

సంచార్ సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాలేషన్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. మొబైల్ ఫోన్లలో దీనిని ముందుగానే ఇన్?స్టాల్? చేయడం తప్పనిసారి కాదని స్పష్టం చేసింది. ఈ యాప్? వల్ల వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం ఏర్పడుతుందంటూ విపక్షాలు తీవ్ర నిరసన చేపట్టిన నేపథ్యంలో కేంద్రం వెనక్కుతగ్గక తప్పలేదు.ఇంతకు ముందు సంచార్ సాథి యాప్‌తో నిఘా పెట్టేందుకు అవకాశమే లేదని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త డివైజ్‌లలో సంచార్ సాథి యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్మార్ట్ ఫోన్ తయారుదారులను కోరటంపై దుమారం రేగడంతో కేంద్ర మంత్రి లోక్?సభలో ఈ వివరణ ఇచ్చారు. అది ప్రజల రక్షణకు సంబంధించి యాప్ అని, ఆ యాప్‌తో నిఘా పెట్టడం సాధ్యం కాదని లోక్‌సభ ప్రశ్నోత్తరాల




కార్యక్రమంలో మంత్రి సింధియా సమాధానం ఇచ్చారు. తమను తాము కాపాడుకునే శక్తి ప్రజలకు ఇవ్వాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు చెప్పారు.సంచార్ సాథి యాప్‌ను తప్పనిసరిగా కొత్త మొబైల్ ఫోన్లలో ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని, పాతవాటిలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని మొబైల్ ఫోన్ తయారీదారులను ఆదేశిస్తూ నవంబర్ 28న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు యాప్? ఫంక్షన్స్? ఆపడానికి, రిస్ట్రిక్ట్ చేయడానికి వీలు లేకుండా చేయాలని ఆదేశించింది. ఫోన్ల తయారీదారులతోపాటు, దిగుమతిదారులు కూడా ఈ నిబంధనను పాటించాలని స్పష్టం చేసింది. కేవలం 90 రోజుల్లోగా దీనిని అమలు చేయాలని పేర్కొంది.మొబైల్? ఫోన్లలో సంచార్? సాథీ యాప్?ను తప్పనిసరి చేయడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా ఉంచడానికి చేస్తున్న ప్రయత్నమని విమర్శించాయి. ముఖ్యంగా కాంగ్రెస్?, ఆమ్? ఆద్మీ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. మోదీ సర్కార్? తీరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రజల గొంతు నులిమే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

# అతను భారత్‌తో యుద్ధం కోరుకుంటున్నాడు

**పాకిస్థాన్ :** మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి అయిన అలీమా ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ భారత్‌తో యుద్ధం కోరుకుంటున్నాడని, యుద్ధం కోసం తహతహలాడుతున్నాడని అన్నారు. తన సోదరుడు ఇమ్రాన్ మాత్రం పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నాలు చేశాడని చెప్పారు.ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అలీమా ఖాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను ఇస్లామిక్ ఛాందసవాదిగా అభివర్ణించారు. ఇమ్రాన్ స్వేచ్ఛావాది అని చెప్పారు. ఈ సందర్భంగా మే నెలలో భారత్-పాక్ మధ్య యుద్ధానికిగల కారణం గురించి ప్రశ్నించగా.. ఆమె మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సందర్భం వచ్చినప్పుడల్లా



మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడని, ఇది భారత్‌తోపాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమేనని అన్నారు.పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లోనే మృతిచెందారని పెద్దఎత్తున ప్రచా రం జరిగిన నేపథ్యంలో ఆయన మరో సోదరి ఉజ్మా ఖానుమ్ ఇమ్రాన్‌ను మంగళవారం కలిశారు. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇమ్రాన్ జైల్లో సురక్షితంగానే ఉన్నారని, అయితే ఆయనను మానసికంగా వేధిస్తున్నట్లు చెప్పారని ఆరోపించారు. తాను జైలు శిక్ష అనుభవించడానికి ఆసిమ్ మునీర్ కారణమని ఇమ్రాన్ తనతో చెప్పాడని తెలిపారు.

## శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ 01 2సార్లు
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే
యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ 02
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ 03
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్
వ్యాసాయా విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే 04
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే 05
సదైకరూప రూపాయ విష్ణవే సర్వజిష్ణవే
యస్య స్మరణమాత్రేణ జన్మసం సార బన్ధనాత్ 06
విముచ్యతే న మ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే
ఓం నమో విష్ణవే ప్రభవిష్ణవే
శ్రీవైశంపాయన ఉవాచ
శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః 07
యుధిష్ఠిర శ్శాంతనవం పునరే వాభ్యభాషత

**యుధిష్ఠిర ఉవాచ**

కి మేకందైవతం లోకే కింవా ప్యేకం పరాయణమ్ 08
స్తువంతః కం క మర్చంతః ప్రాప్నుయుః మానవా శ్శుభమ్
కో ధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః 09
కిం జపన్ ముచ్యతే జన్తుః జన్మ సంసార బంధనాత్

**శ్రీ భీష్మ ఉవాచ**

జగత్ ప్రభుం దేవదేవం అనన్తం పురుషోత్తమమ్ 10
స్తువన్ నామసహస్రేణ పురుషః సతతోత్థితః
తమేవ చార్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ 11
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ
అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్ 12
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్
బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తి వర్ధనమ్ 13
లోకనాథం మహద్భూతం సర్వభూత భవోద్భవమ్
ఏష మే సర్వధర్మాణాం ధర్మో ధికతమో మతః 14
యద్భక్త్యా పుణ్డరీకాక్షం స్తవై రర్చే న్నర సదా
పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః 15
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్
పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళమ్ 16
దైవతం దేవతానాం చ భూతానాం యో వ్యయః పితా
యత స్సర్వాణి భూతాని భవంత్యాది యుగాగమే 17
యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే
తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే 18
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాపహమ్
యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః 19
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూత యే
విష్ణో ర్నామసహస్రస్య వేదవ్యాసో మహా నృషిః 20
ఛన్దో నుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః
అమృతాం శూద్భవో బీజం శక్తి ర్దేవకి నందనః 21
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే
విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వర మ్ 22
అనేకరూప దైత్యాంతం నమామి పురుషోత్తమమ్
అస్య శ్రీవిష్ణోః దివ్య సహస్రనామ స్తోత్ర మహామంత్రస్య, శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛన్దః, శ్రీ మహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారయణో దేవతా, అమృతాంశూద్భవో భానురితి బీజం, దేవకీ నందన స్స్రష్టేటి శక్తిః, ఉద్భవః క్షోభణో దేవ ఇతి పరమో మంత్రః, శంఖభృన్నన్దకీ చక్రీతి కీలకం, శార్గ్ఙధన్వా గదాధర ఇత్యస్త్రం, రథాంగపాణి ర క్షోభ్య ఇతి నేత్రం, త్రిసామా సామగా స్సామేతి కవచం, ఆనందం పరబ్రహ్మేతి యోనిః, ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః, శ్రీ విశ్వ రూప ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే
( కైంకర్యరూపే శ్రీ )సహస్రనామ జపే వినియోగః 23

**ధ్యానమ్**

క్షీరోదన్వత్ ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానాం
మాలా క్లుప్తాసనస్థః స్ఫటికమణి నిభైః మౌక్తికైః మణ్డితా
శుభ్రై రభ్రై రదభ్రై రుపరి విరచితై ర్ముక్తపీయూషవర్షై :
ఆనందీ నః పునీయాత్, అరినళిన గదా శంఖపాణి ర్ముకుందః
24
భూః పాదౌ యస్యనాభిః వియదసు రనిలః చంద్రసూర్యౌచ నేత్రే
కర్ణావాశా శ్శిరోద్యౌః ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః
అంతస్థం యస్య విశ్వం సురనర ఖగగో భోగి గంధర్వ దైత్యైః
చిత్రం రంరమ్యతే, తం త్రిభువనవపుషం విష్ణు మీశం
నమామి 25

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగమ్
లక్ష్మీకాన్తం కమలనయనం యోగిహృ ద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాథమ్ 26
మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకం
కౌస్తుభోద్భాసితాంగమ్
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వన్దే సర్వలోకైక
నాథమ్
నమస్సమస్త భూతానాం ఆది భూతాయ భూభృతే
అనేకారూపరూపాయ విష్ణవే ప్రభ విష్ణవే 27
సశంఖచక్రం సకిరీటకుం డలం సపీతవస్త్రం సరసీరు హేక్షణమ్
సహారవక్షస్థ్సలశోభి కౌస్తుభం నమామి విష్ణుం శిరసా

## గురు దేవోభవ



తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.

తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.వేదవ్యాస మహర్షి పంచమ వేదంగా లోకానికి అందించిన మహాభారతంలో గురు వైభవాన్ని ప్రకటించే ఇతివృత్తాలు ఎన్నో కనిపిస్తాయి. జగద్గురువైన శ్రీకృష్ణుడే స్వయంగా సాందీపుని దగ్గర శిష్యునిగా విద్యాభ్యాసం చేయడం, కురు కుమారులు ద్రోణాచార్యుడి శిష్యరికంలో సాటిలేని యోధులుగా తయారవ్వడం, కేవలం గురుభక్తితో ఏకలవ్యుడు సాటిలేని మేటి విలుకాడుగా ప్రసిద్ధిపొందడం%‰¯% ఇవన్నీ ప్రాచుర్యం పొందిన కథలు. గురువైభవాన్ని ప్రకటించే మరో వృత్తాంతం మహాభారతం అరణ్యపర్వంలో ఉంది.

**యవక్రీతుడి వృత్తాంతం**

భరద్వాజుడు, రైభ్యుడు ఇద్దరూ సహాధ్యాయులు. ఒకే గురువు వద్ద విద్యాభ్యాసం చేసి, సకల విద్యల్లోను పాండిత్యం సంపాదించారు. తపస్సుతో ఇద్దరూ మహర్షిత్వాన్ని సాధించారు. రైభ్యుడి కుమారులు కూడా తండ్రి చూపిన మార్గంలో సద్గురువును ఆశ్రయించి, వేదవేదాంగాలు అభ్యసించి, ఉత్తమ గుణాలతో శోభిల్లుతూ, అందరి ప్రశంసలు అందుకున్నారు. భరద్వాజుని కుమారుడు యవక్రీతుడు. ఉపనయనం జరిగిన క్షణం నుంచి, యవక్రీతుడు కేవలం తపస్సు ద్వారా సకల విద్యల్లో పాండిత్యం సంపాదించాలని భావిస్తుంటాడు. గురు శుశ్రూష ద్వారా విద్యాభ్యాసం చేయాలంటే ఎంతో సమయం పడుతుంది కాబట్టి, తపస్సు ద్వారా తేలికగా జ్ఞానం పొందవచ్చని అతని ఆలోచన. రైభ్యుడి కుమారులకు సమాజంలో దక్కుతున్న ఆదరణ ఇతనిలో మరింత మాత్సర్యాన్ని కలిగిస్తుంది. దీంతో యవక్రీతుడు ఇంద్రుడి గురించి, ఘోర తపస్సు చేశాడు.

'గురూపదేశం లేని విద్య మాత్సర్యాన్ని, అహంకారాన్ని పెంచుతుందని, ఈ ప్రయత్నం విడిచిపెట్టమని' వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో ఇంద్రుడు యవక్రీతుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. అయినా, అతను పట్టు విడిచిపెట్టడు. దీంతో, చేసేదిలేక ఇంద్రుడు యవక్రీతుడికి వేదాలను భాసింపజేస్తాడు. అహంకారం తగదంటూ భరద్వాజుడు యవక్రీతుడికి ఎన్నో జాగ్రత్తలు చెబుతాడు. కానీ, వర గర్వంతో విర్రవీగుతున్న యవక్రీతుడు రైభ్యుని ఆశ్రమంలోకి ప్రవేశించి, మహర్షి కోడలిని చెరబట్టే ప్రయత్నం చేస్తాడు. దీంతో కోపించిన రైభ్యుడు యవక్రీతుడిని వధిస్తాడు. కొంతకాలం తర్వాత రైభ్యుని రెండో కుమారుడు దయతలచి, తన తపశ్శక్తితో యవక్రీతుడిని పునర్జీవితుణ్ని చేస్తాడు.

తన విద్యలు ఎందుకు నిష్ప్రయోజనం అయ్యాయని యవక్రీతుడు దేవతల్ని ప్రశ్నిస్తాడు. 'గురుముఖంగా నేర్చుకోకపోవటం వల్లే నీ విద్యలు ఫలించలేద'ని దేవతలు స్పష్టం చేస్తారు. ఇదీ గురువైభవం. ఈ భావాన్నే ప్రకటిస్తూ శ్రీనాథ మహాకవి 'గురువు నేర్పని విద్య గుడ్డివిద్య' అన్నాడు. మహాకవి కాళిదాసు 'శుశ్రూష స్వగురూన్' అంటూ 'గురు శుశ్రూష ద్వారానే విద్యలు నేర్చుకోవాల'ని చెప్పాడు.

**దీపకుడి గురుభక్తి**

కేవలం నిశ్చలమైన గురుభక్తితో శ్రీమన్నారాయణుని సాక్షాత్కారం పొందిన శిష్యలోక చక్రవర్తి దీపకుడు. వేదధర్ముడనే గురువు దగ్గర దీపకుడు విద్యాభ్యాసం చేస్తుంటాడు. వినయంతో, సకల శుభ లక్షణాలతో గురువుకు అత్యంత ప్రీతిపాత్రుడవుతాడు. ఒకరోజు వేదధర్ముడు దీపకుడిని పిలిచి 'దీపకా! పూర్వజన్మలో నేను చేసిన రెండు పాపాలను పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సి ఉంది. ఇందుకు కాశీ క్షేత్రానికి వెళ్లాలి. ఆ పాపాలను ఆవహింపజేసుకున్నప్పుడు నా స్వభావం పూర్తిగా మారిపోతుంది. అత్యంత కఠినుడిగా మారిపోతాను. కుష్ఠు రోగం వస్తుంది. జుగుప్స కలిగించే రూపంతోపాటు అంధత్వం కూడా వస్తుంది' అంటాడు.

దీపకుడు 'మహానుభావా! ఆ సమయంలో తమకు సేవ చేసుకునే భాగ్యం నాకు అనుగ్రహించండి' అని గురువును వేడుకుంటాడు. ఇద్దరూ కలిసి కాశీ క్షేత్రానికి చేరుకుంటారు. వేదధర్ముడు పాపాలను ఆవహింపజేసుకుంటాడు.

అతిభయంకరమైన రూపం, కఠిన స్వభావం అతనికి సంప్రాప్తిస్తాయి. అన్నిటినీ తట్టుకుంటూ గురుసేవ చేస్తుంటాడు దీపకుడు. ఆ శిష్యుడు చేస్తున్న అనితర సాధ్యమైన గురుసేవకు మహదానందం పొందిన కాశీ విశ్వనాథుడు దీపకుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతాడు. ఆ సమయంలో నిద్రిస్తున్న గురువుకు పాదసేవ చేస్తుంటాడు దీపకుడు. 'తనకేమీ తెలియదని, గురువుగారు నిద్ర నుంచి మేల్కొనగానే, వారిని అడిగి చెబుతాన'ని విశ్వనాథుడికి బదులిస్తాడు.

వేదధర్ముడు నిద్ర నుంచి మేల్కొనగానే జరిగిందంతా వివరిస్తాడు దీపకుడు. 'మీ పాపాలు పోగొట్టమని విశ్వనాథుడిని అడుగుతానని, అందుకు అనుమతించమ'ని అభ్యర్థిస్తాడు. ఇందుకు వేదధర్ముడు ఒప్పుకోడు. ఎవరి పాపాలు వారే అనుభవించాలని, అప్పుడే పూర్తిగా కర్మఫలితం నశిస్తుందంటాడు. మర్నాడు దీపకుడు శివుడి సన్నిధికి వెళ్తాడు. కానీ, ఏ వరం కోరుకోడు. నిశ్చలంగా దైవాన్ని చూస్తూ నిల్చుంటాడు. దీపకుడి ఉన్నతమైన సాధనను మెచ్చుకున్న విశ్వనాథుడు, శ్రీమన్నారాయణుడి దగ్గరికి వెళ్లి, దీపకుని వృత్తాంతం చెబుతాడు. హరిహరులిద్దరూ దీపకుడికి ప్రత్యక్షమవుతారు.

'నారాయణా! మిమ్మల్ని నేనెప్పుడూ దర్శించలేదు. కనీసం స్మరించలేదు కూడా. నాకు ఎందుకు ప్రత్యక్షమయ్యార'ని దీపకుడు విష్ణుమూర్తిని ప్రశ్నిస్తాడు. అందుకు నారాయణుడు 'దీపకా! నీవు అచంచలమైన భక్తితో గురుసేవ చేస్తున్నావు. గురువు త్రిమూర్తి స్వరూపుడు. కాబట్టి, నన్ను అర్చించినట్టే. ఏం వరం కావాలో కోరుకో' అని స్వామి దీపకుడిని అడుగుతాడు. 'స్వామీ! ఎన్నటికీ తరగని అచంచలమైన గురుభక్తి నాకు ప్రసాదించమ'ని దీపకుడు నారాయణుడిని వేడుకుంటాడు. అతని గురుభక్తికి మెచ్చిన నారాయణుడు అనేక వరాలు అనుగ్రహిస్తాడు. నిశ్చలమైన గురుభక్తితో తనతోపాటు తన గురువును కూడా తరింపజేసిన ఘనతను దీపకుడు సాధించాడు. గురువైభవానికి అసలైన నిదర్శనం ఇది.

## నేను రామానుజదాసుడను!



ఒకానొక సందర్భంలో నేను 'రామానుజ దాసుడను' అని తనకు తాను రామానుజా చార్యులకు దాసుడని పేర్కొన్నారు శ్రీరంగనాథస్వామివారు. ఎందుకంటే రామా నుజులవారి భక్తికి ఎంతో పరవశులయ్యేవారు స్వామి. మహోన్నత భక్తులు%‰¯% సమ తామూర్తి%‰¯% మానవతావాది శ్రీ రామానుజాచార్యులు అంటే శ్రీరంగనాథస్వామికి అంత ఇష్టం%‰¯%. అభిమానం. అందుకే రామానుజాచార్యుల నిర్యాణం అనంతరం ఆయన పార్థివ దేహాన్ని కూడా తన ఆలయంలోనే వుంచుకున్నారు రంగనాథస్వామి. రామానుజాచార్యు నికి రంగనాథస్వామి దాసుడిని అని పేర్కొన్న కథ ఒకటి శ్రీరంగంలో ప్రచారంలో వుంది. కొన్ని శతాబ్దాల క్రితం కూడా శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో స్వా మివారి ప్రసాదానికి భక్తులు బారులు తీరి వుండేవారు. ప్రతీ రోజు ప్రసాదం కొరకు ఎదురు చూస్తూ బారులు తీరిన భక్తులలో ఒక పేద వైష్ణవుడు వుండేవాడు. ఆయన రోజూ వరుసలో అందరికంటే ముందు నిలబడేవాడు. ఆయన తన కోసమేకాక, తన ఆరుగురు కొడుకుల కొరకు కూడా ప్రసాదం తీసుకెళ్ళేవాడు. ఆలయ అధికారులు అంతమందికి ప్రసాదాన్ని ఒకే వ్యక్తికి ఇవ్వడం సరికాదని అనేవారు. ఆయన మాత్రం ప్రసాదం ఇవ్వమని పట్టుపట్టేవాడు. ఇలా రోజూ ఆలయ అధికారులకి అతనికి కొంత వాదులాట జరిగేది.

"ప్రసాదం అంతా నీకే ఇచ్చేస్తే నీ వెనుక వున్న మిగిలిన భక్తులందరికి కొంచెమే ప్రసాదం లభిస్తుంది" అని ఆలయ అధికారులు ఆ వైష్ణవుడిని మందలించేవారు. అయినా కూడా ఆ పేద వైష్ణవుడు "నా ఆరుగురు కొడుకులు ఆహారం లేక బక్క చిక్కిపోయారు, వారు ఆకలితో అలమటిస్తూ వుంటారు. నేను తీసుకువెళ్ళే ప్రసాదానికై ఎదురుచూస్తూ వుంటారు. కనుక మీరు ఆలయ ప్రసాదం ఇవ్వకపోతే వారు నాకు దక్కరు" అని ఆయన ప్రాధేయపడేవాడు.ఒకరోజు రామానుజుల వారు వైష్ణవుడు ఆలయ అధికారులకు మధ్య జరుగుతున్న వాదోపవాదాలను చూసి అక్కడకు వచ్చారు. "ఏమి జరిగింద"ని అడిగారు.ఆలయ అధికారులు ఆ పేద వైష్ణవుణ్ణి చూపించి రోజూ అధిక ప్రసాదం కావాలని ఆయ న గొడవ చేస్తున్నాడని తెలియచేస్తారు. రామానుజులు ఆ వైష్ణవుడి దగ్గరకు వెళ్ళి "నాయనా నీవు ఆలయములో కొన్ని కైంకర్యములు చేసి ఎక్కువ ప్రసాదాన్ని పొందవచ్చు కదా" అని అడుగుతారు. దానికి ఆ వైష్ణవుడు–

"స్వామీ! నా బక్క చిక్కిన కొడుకులని మీరే చూడండి, రోజంతా వారికి సేవలు చేయడ ములోనే నాకు సమయం సరిపోతుంది, వీరిని వదిలేసి నేను ఆలయంలో ఏ కైంకర్యం చేయ లేను. పైగా నేను వేదాలను గాని, దివ్య ప్రబంధములను గాని నేర్చుకోలేదు, అందువల్ల నేను ఆలయ సేవ కాలములలో కూడా ఏ కైంకర్యం చేయలేను, నాకు కొన్ని విష్ణు సహస్ర నామం లోని శ్లోకాలు తప్ప ఏమి రావు, నేనేమి చేయగలను." అని బదులిచ్చాడు ఆ పేద వైష్ణవుడు.

"సరే నీకు తెలిసిన విషు సహస్రనామ శోకాలని చెప్పు" అన్నారు భవ్య భవత్ ప్రభు:, భూత కృత్ భూత భృత్.." అని ఆపేసి, "నాకు అంతవరకే వచ్చు స్వామీ!" అని చెప్పాడు.

అతని ఇబ్బంది చూసి రామానుజులవారు "సరే నీకు 'భూత భృత్' అనే భగవన్నామ ము తెలుసుకదా! ఆ నామాన్నే జపించు, ఇక నీకు ఇక్కడికి ఆహారార్థియై రావలసిన అవసరం ఉండదు" అని సెలవిచ్చారు.

ఆనాటి నుండి ఆ వైష్ణవుడు ఇంకెప్పుడూ కోవెల ప్రసాద వితరణ ప్రాంతంలో కనిపిం చలేదు. ప్రసాదపు వరుసలలో గొడవలు ఆగిపోయాయి. అయితే ఇంకో విచిత్రమైన సమస్య మొదలయింది. రోజూ రంగనాథులకు సమర్పిస్తున్న ప్రసాదంలో చాలా భాగం మాయమై పోతుంది. పంచడానికి కొంచెమే వుంటోంది. ఆలయంలో ప్రసాదం దొంగల బారిన పడు తుందేమో అని భద్రత పెంచారు కూడా. అయినా రంగనాథులకు సమర్పించిన దానిలో చాలా ప్రసాదం మాయమైపోతున్నది. ఆ పేద బ్రాహ్మణుడే దొంగిలిస్తున్నాడేమో అని అనుమానం వస్తున్నది అందరికి. చివరకు రామానుజులకి ఈ సమస్య గురించి తెలియచేసా రు. ఆ పేద బ్రాహ్మణుణ్ణి పిలుచుకు రమ్మని రామానుజుల వారు మనుషులని పంపారు. వారు తిరిగి వచ్చి ఆయన ఆలయానికి దగ్గరగా వున్న తన పాత నివాసంలో ఉండటంలేదని తెలిపారు. ఆ తరువాత కూడా ఆ వైష్ణవుడు ఎక్కడ ఉంటున్నాడో ఎవరికీ సమాచారం తెలియలేదు.

కొంత కాలం తర్వాత, రామానుజులు ఏదో కార్యక్రమానికై కొల్లిడం నది (శ్రీరంగం దగ్గర కావేరి పాయ) దాటుతుండగా ఈ వైష్ణవుడు "స్వామీ%‰¯% స్వామీ" అని రామానుజులని బిగ్గరగా పిలుస్తూ వారిని సమీపించాడు. రామానుజుల పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయన కనుల నుండి ధారగా కన్నీరు రాసాగింది.

"స్వామీ! మీ కటాక్షం వలన ఆ పిల్లవాడు రోజూ నాకు ప్రసాదం అందచేస్తున్నాడు. అం దువల్ల నా పిల్లలు సరిపడినంత పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులయ్యారు. ఇక ఆల య అధికారులతో గొడవలు ఎందుకని కోవెల దగ్గర గృహం నుండి నేను ఇక్కడికి వచ్చేసా ను. నేను మీకు సదా కృతజ్ఞుడను. మీరు చెప్పిన విధంగా రోజూ నేను "భూతభృతే నమ:" జపాన్ని చేస్తున్నాను." అన్నాడు.

అతని మాటలు విన్న రామానుజులు ఆశ్చర్యచకితులయ్యారు. "ఎవరా పిల్లవాడు? వాని పేరేమిటి?" అని అడిగారు.

"ఆ పిల్లవాడు తాను రామానుజాదాసుడనని చెప్పాడు స్వామీ" అన్నాడు వైష్ణవుడు. రామానుజాచార్యులవారికి అంతా అర్థమయింది. 'భూత భృత్' నామానికి అర్థం 'సమస్త జీవుల'ని పోషించువాడు అని అర్థంకదా! రామానుజుల వారి ఆజ్ఞానుసారం 'భూత భృత్'ను పఠించిన వైష్ణవుడి ఆకలి బాధలను తీర్చారు ఆ రంగనాథస్వామి.

ఇంతకీ ఆ బాలుడు ఇంకెవ్వరు సాక్షాత్ శ్రీరంగనాథుడే అని తెలుసుకునారు శ్రీరామా నుజాచార్యులు. బాలుడి రూపంలో

## పాదోదకం పావనం శుభం



సనాతన సంస్కృతిలో తీర్థానికి విశిష్టమైన స్థానం ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో, ప్రత్యేకించి భక్తి ప్రపంచంలోను, ముఖ్యంగా భక్తుల హృదయాలలోను తీర్థానికి విశేషమైన ప్రాముఖ్యత ఉంది. అయితే అన్ని ప్రసాదాలు అన్నిటిలోను అతి విశిష్టమైనది తీర్థ ప్రసాదం అని చెబుతా రు. ఇంట్లో పూజ, అభిషేకం, ఆరాధన, వ్రతంలాంటి దైవ సంబంధిత కార్యాలు చేసుకున్న తర్వాత తీర్థాన్ని తీసుకుంటాం. అదేవిధంగా దేవాలయాలలో దైవాన్ని దర్శించుకున్న తర్వాత అర్చక స్వాములు యిచ్చే తీర్థాన్ని తీసుకుంటాం. దేవాలయాలలోను, అదే రకంగా ఇళ్ళలోను అర్చన తర్వాత తీసుకునే పవిత్ర జలాన్ని లేక పాలను తీర్థ ప్రసాదం అని అంటా రు. తలపైన శఠగోపం పెట్టించుకున్న తర్వాత, దేవుణ్ణి అభిషేకించిన పాలో, ఉదకమో, పెరు గో, పంచామృతాలో, కళ్ళకు అద్దుకుని తీర్థ ప్రసాదంగా భక్తి ప్రపత్తులతో తీసుకుంటారు."అకాల మృత్యు హరణం సర్వవ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం శ్రీ పరమేశ్వ ర పాదోదకం పావనం శుభం." అనే మంత్రాన్ని అర్చక స్వామి జపిస్తూ, తీర్థాన్ని భక్తులకు ఇస్తాడు. అయితే "శ్రీ పరమేశ్వర పాదోదకం పావనం శుభం" అనే మంత్రంలో, పరమేశ్వర దగ్గర, ఏ దేవునికి మనం పూజ/ అర్చన/ అభిషేకం చేసామో, ఆ దేవుని పేరును చదవాలనే విషయం ఇక్కడ గమనించాలి."అకాల మృత్యు హరణం సర్వ వ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం" అనే మం త్రోచ్చారణ వలన అనంతమైన, అమోఘమైన, పవిత్రమైన మంత్రశక్తి తీర్థానికి ఆపాదింప బడి, ఆ మంత్ర బలం తీర్థానికి సంపూర్ణంగా వస్తుంది.తీర్థం అంటే తరింప చేసేది అని శాస్త్రం చెబుతున్న అర్థం. తీర్థాన్ని మూడుసార్లు తీసుకో వడం ప్రశస్తం అని పెద్దలు చెబుతారు. మొదటిసారి తీర్థం తీసుకోవడం వలన శారీరక, మా నసిక శుద్ధి జరుగుతుంది. రెండవసారి తీసుకోవడం వలన న్యాయ, ధర్మ పరివర్తన జరుగు తుంది. మూడోసారి తీసుకునేటప్పుడు పరమేశ్వర పథం అనుకుంటూ తీర్థాన్ని తీసుకోవా లని పెద్దలు చెబుతారు. అదేవిధంగా "కేశవాయ స్వాహా" అనుకుంటూ మొదటిసారి, "నారాయణ స్వాహా" అంటూ రెండోసారి. "మాదవాయ స్వాహా" ఈవిధంగా తీర్థప్రసాదాన్ని మూడుసార్లు తీసుకోవడం వలన జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను (అంటే శరీరాన్ని), ముఖ్యమైన మనసునూ సిద్ధం చేయడం, శుద్ధం చేయడము అవుతుందనేది అంతర్లీనంగా దాగున్న అంతరార్థ ఆధ్యాత్మిక రహస్యం అని చెబుతారు. తీర్థం తీసుకున్నాక కుడిచేతిని కొందరు తలకు తుడుచుకుంటారు. అలా చేయకూడదని శా స్త్రం చెబుతోంది. ఎందుకంటే తలపైన బ్రహ్మదేవుడు ఉంటాడు కాబట్టి మన ఎంగిలిని బ్రహ్మకు అర్పణ చేసినట్లు అవుతుందని.వివిధ రకాల తీర్థాలు: జలతీర్థ ప్రసాదం, కషాయతీర్థ ప్రసాదం, పంచామృత తీర్థ ప్రసా దం, పానకతీర్థ ప్రసాదం అని తీర్థ ప్రసాదాలు నాలుగు రకాలు. ఇవే కాకుండా తులసి తీర్థం, పచ్చకర్పూర తీర్థం, బిల్వ తీర్థం యిలా రకరకాల తీర్థాలు కూడా ఉన్నాయి.

**తీర్థం ఇలా తీసుకోవాలి**

ఎడమ అరచేతిలో కుడి అరచేతిని పెట్టి, కుడిచేతి చూపుడు వేలు మధ్యలోకి బొటన వేలుని మడిచి ( అంటే%.గోముఖ ముద్రలో ) తీర్థాన్ని భక్తుడు తీసుకోవాలి.మరికొంత విపులంగా చెప్పాలంటే, తీర్థాన్ని మగవారైతే తన భుజంపై ఉండే ఉత్తరీ యం లేదా కండువాను, ఆడవారైతే తమ చీర లేదా చున్నీ పైకొంగును ఎడమ చేతిలో నాలు గు మడతలు వచ్చే విధంగా వేసుకోవాలి. వేసుకున్నాక ఎడమ చేతిలో ఉన్న మడతపై కుడిచే తిని ఉంచి, చూపుడు వేలు ఏమాత్రం తగలకుండా, బొటన వేలుని నడిమి వేలు క్రింది కణుపు నకు గట్టిగా నొక్కిపెట్టి, తీర్థం క్రిందన పడకుండా, నోటి నుంచి జుర్రుకుంటున్నట్టు శబ్దం రాకుండా చూసుకుంటూ, సంబంధిత దైవ నామాలను స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో తీర్థాన్ని తీసుకోవాలి.

**తీర్థాన్ని తీసుకోకూడని సందర్భాలు**

నొసట విభూతిగానీ కుంకుమగానీ లేనప్పుడు తీర్థ ప్రసాదాన్ని తీసుకోకూడదు. అంటు, పురుడు, మైల ఉన్నప్పుడు తీర్థం తీసుకోకూడదు. స్త్రీలు నెలసరి సమయంలో తీసుకోకూడదు. అపరిశుభ్రంగా ఉన్నప్పుడు అంటే స్నానాదికాలు ముగించుకోకుండాను, మల మూత్రాదులు అయినాక కాళ్ళు చేతులు కడుక్కోకుండాను తీర్థ సేవనం చేయకూడదు. తీర్థప్రసాదం ఏదైనా, అది ఏ రూపంలో ఉనా అతి పవిత్రమైనది.

# గైక్వాడ్, కోహ్లీ సెంచరీలు





కింగ్ విరాట్ కోహ్లీ (102) మరోసారి తన విశ్వరూపం ప్రదర్శించాడు. వరుసగా రెండో సెంచరీ సాధించాడు. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ (105) కూడా తొలి శతకంతో మెరిశాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా భారీ స్కోరు సాధించింది. రాయ్‌పూర్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు టీమిండియా బ్యాటర్లు చుక్కలు చూపించారు రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన కింగ్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించి ఈ రోజు మరో సెంచరీ చేశాడు. 90 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో శతకం బాదాడు. కోహ్లీ కెరీర్‌లో ఇది 53వ వన్డే సెంచరీ. మరో ఎండ్‌లో గైక్వాడ్ (105) కూడా అద్భుత శతకం సాధించాడు. గైక్వాడ్ 77 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 2 సిక్స్‌లు, 12 ఫోర్లు కొట్టాడు. కెరీర్‌లో తొలి సెంచరీ చేశాడు (అనంతరం యన్‌సెన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.కోహ్లీ, గైక్వాడ్ అవుటైన తర్వాత టీమిండియా పరుగుల వేగం తగ్గిందికెప్టెన్ కేఎల్ రాహుల్ (66 నాటౌట్) మరో హాఫ్ సెంచరీ సాధించినప్పటికీ అనుకున్నంత భారీ స్కోరు రాలేదు. సుందర్ ఒక్క పరుగుకే అవుటయ్యాడు. జడేజా వేగంగా పరుగులు చేయలేకపోయాడు. దీంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. రుతురాజ్-విరాట్ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 156 బంతుల్లో 195 పరుగులు చేశాడు. ఇక చివరలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కేఎల్ రాహుల్ సైతం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. దాంతో టీమిండియా భారీ స్కోర్‌ను చేయగలిగింది. కేఎల్ రాహుల్ 43 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 66 పరుగులతో అజేయంగా నిలిచాడు. కేఎల్ రాహుల్‌కు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (24) సహకారం అందించాడు. దాంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్‌కు రెండు, బర్గర్, ఎన్గిడికి చెరో వికెట్ దక్కింది. ఇక వన్డేల్లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇది రెండో భారీ స్కోర్. 2010లో గ్వాలియర్ వన్డేలో మూడు వికెట్ల నష్టానికి 401 పరుగులు చేసింది.మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వన్డేలో టీమిండియా విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ రోజు మ్యాచ్‌లో కూడా గెలిస్తే ఈ సిరీస్‌ను టీమిండియా దక్కించుకుంటుంది

# 3 నెలల తర్వాత రీఎంట్రీ





సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు తరపున బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా, పంజాబ్ జట్టుపై తన ప్రతాపం చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇందులో 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి. హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలోకి అడుగుపెట్టడమే ఆలస్యం.. తనదైన శైలిలో రికార్డుల మోత మోగించాడు. గాయం కారణంగా కొంతకాలం ఆటకు దూరంగా ఉన్న హార్దిక్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ద్వారా రీఎంట్రీ ఇచ్చి బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డులో హార్దిక్ చోటు సంపాదించాడు.రికార్డు వివరాలు.టి20 క్రికెట్ చరిత్రలో 'సెంచరీ లేకుండానే 300కు పైగా సిక్సర్లు' బాదిన భారతీయ క్రికెటర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా చేరాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ క్రికెటర్ ఎంఎస్ ధోని మాత్రమే. ఇప్పుడు హార్దిక్ పాండ్యా ఆ జాబితాలో చేరిన రెండో భారతీయుడిగా రికార్డు సృష్టించాడుఎంఎస్ ధోని: ఇప్పటివరకు టీ20లలో 300కు పైగా సిక్సర్లు కొట్టిన ధోని అత్యధిక వ్యక్తిగత స్కోరు 84 పరుగులు మాత్రమే (సెంచరీ లేదు).రాంచీలో చెత్త ఆట.. కట్‌చేస్తే.. 2వ వన్డే నుంచి ముగ్గురు ఔ12 బంతుల్లో హాఫ్ సెంచరీ.. 32 బంతుల్లో సెంచరీ.. అభిషేక్ బీభత్సంఎ హార్దిక్ పాండ్యా: తాజాగా బరోడా తరపున పంజాబ్‌పై ఆడిన ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు బాదడం ద్వారా హార్దిక్ తన టి20 కెరీర్‌లో 300 సిక్సర్ల మైలురాయిని దాటాడు. హార్దిక్ టీ20 అత్యధిక స్కోరు కూడా సెంచరీ కంటే తక్కువే కావడం విశేషం.హార్దిక్ రీఎంట్రీ ఇన్నింగ్స్.సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు తరపున బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా, పంజాబ్ జట్టుపై తన ప్రతాపం చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇందులో 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి. హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దక్షిణా ఫ్రికాతో జరగబోయే టీ20 సిరీస్‌కు ముందు హార్దిక్ పాండ్యా ఇలాంటి ఫామ్‌లో ఉండటం భారత జట్టుకు శుభపరిణామం. బౌలింగ్‌లో కాస్త తడబడినప్పటికీ, బ్యాటింగ్‌లో ఫినిషర్‌గా తన సత్తాను మరోసారి చాటాడు.

# యువ ఆటగాళ్లు కాదు రో-కోనే దిక్కు: మహ్మద్ కైఫ్




రాయ్‌పూర్ వేదికగా టీమిండియా-సౌతాఫ్రికా మధ్య రెండో వన్డే మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. తొలి వన్డేలో రో-కో అద్భుత ప్రదర్శనతో 17 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్.. ఈ మ్యాచ్‌తో సిరీస్ పట్టేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు చేశాడు.'విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పరుగు లు చేయకుండా పెవిలియన్ చేరితే మ్యాచ్ కచ్చితంగా ఓడిపోయేది. భారత జట్టు 300కి పైగా పరుగులు చేయలేకపోతే.. సౌతాఫ్రికా విజయం సాధించి ఉండేది అనే దాంట్లో సందేహమే లేదు. టీమిండియా గెలవాలంటే.. రో-కో రాణించాలన్న విషయం స్పష్టమైంది. ఇప్పుడంతా యువ క్రికెటర్లపై చర్చ జరుగుతోంది. జట్టులో వారికి పెద్ద సంఖ్యలో చోటు కల్పిస్తున్నారు. కానీ వారంతా కలిసి 200 పరుగులు కూడా చేయలేకపోతున్నారు. చివరికి టీమిండియాకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీనే దిక్కయ్యారు' అని కైఫ్ విశ్లేషించాడు.సంబంధం ఉందివిరాట్ సెం చరీకి, టీమిండియా విజయానికి సంబంధం ఉంది. అతడు ఏడు సిక్స్‌లు బాదితే, రోహిత్ మూడు సిక్కులు కొట్టాడు. వారు సిడ్నీలో చేసినట్లుగానే రాంచీలోనూ భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రస్తుతం టీమిండియా పరిస్థితి బాగాలేదు. సౌతాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత, రాంచీ వన్డేలో విజయం ఊరట కలిగించేదే. ప్రస్తుతం కోహ్లీకి 37, రోహిత్‌కు 38 ఏళ్లు. వారు పరుగులు చేయకుండా ఉండి ఉంటే.. సౌతాఫ్రికా సునాయసంగా రాంచీ వన్డేలో గెలిచి ఉండేది' అని కైఫ్ వివరించాడు.

# బీవోఎం షేర్లకు భలే గిరాకీ





ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం) షేర్లకు మదుపరుల నుంచి విశేష స్పందన లభించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో భాగంగా మంగళవారం ఉదయం నాన్-రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఒక్కో షేర్‌ను రూ.54 ధరతో 38,45,77,748 (దాదాపు 38.46 కోట్లు) షేర్లను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. అయితే తొలిరోజే ఏకంగా 407 శాతం (4.07 రెట్లు) అధికంగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. దీంతో బేస్ ఆఫర్‌కు అదనంగా మరింత వాటాను విక్రయానికి తీసుకురావాలని మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే సుమారు మరో 8 కోట్ల షేర్లను సేల్‌కు జత చేశారు. వీటికి బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్లను దాఖలు చేయవచ్చు. ఈ మేరకు దీపం కార్యదర్శి అరుణిష్ చావ్లా 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, తొలుత అమ్మకానికి పెట్టిన వాటా బ్యాంక్ పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 5 శాతానికి సమానం.దీనికి మరొక్క శాతం (7,69,15,549) షేర్లు కలిశాయిప్పుడు. దీంతో 6 శాతానికి సమానమైన 46.14 కోట్లకుపైగా షేర్లు ఈ ఓఎఫ్ఎస్ ద్వారా కేంద్రం అమ్మినైట్టెంది. తద్వారా దాదాపు రూ.2,492 కోట్లు ఖజానాకు చేరుతున్నాయి. ఇక సోమవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో బీవోఎం షేర్ రూ.57.66 వద్ద ముగిసింది. అయినప్పటికీ దీనిపై 6.34 శాతం రాయితీతో రూ.54 ఫ్లోర్ ప్రైస్‌కే బ్యాంక్ షేర్‌ను కేంద్రం అమ్మకానికి పెట్టింది. కాగా, పుణె కేంద్రంగా నడుస్తున్న బీవోఎంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 79.60 శాతం వాటా ఉన్నది. అయితే ఈ విక్రయంతో సర్కారు వాటా 75 శాతం దిగువకు పడిపోతున్నది. తద్వారా క్యాపిటల్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సంస్థల కోసం పెట్టిన మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన 25 శాతాన్ని బీవోఎం అందుకున్నట్టవుతున్నది.

# ఇంట్రాడేలో రూ.90కి డాలర్-రూపీ మారకం



ముంబై: దేశీయ కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక దశలో 47 పైసలు క్షీణించి తొలిసారిగా రూ.90 మైలురాయికి చేరింది. చివరికి 43 పైసల నష్టంతో రూ.89.96 వద్ద ముగిసింది. ఇది ఆల్‌టైమ్ కనిష్ఠ ముగింపు కూడా. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దిగుమతిదారుల నుంచి అమెరికన్ కరెన్సీకి డిమాండ్ పెరగడం, ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, స్పెక్యులేషన్ ట్రేడర్ల షార్ట్ కవరింగ్ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటం, వాణిజ్య లోటు ఆందోళనలు కూడా ఇందుకు మరో కారణమని వారన్నారు. ఈ ఏడాదిలో రూపాయి విలువ 5 శాతం మేర క్షీణించింది. ఆసియాలోకెల్లా అత్యధికంగా నష్టపోయిన కరెన్సీ మనదే.ముమ్ముందు మరింత క్షీణత"డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటుకు రూ.90 ప్రధాన నిరోధక స్థాయిగా ఉండనుంది. ఒకవేళ ఈ స్థాయిని కూడా అధిగమిస్తే, ఎక్స్ఛేంజ్ రేటు రూ.91 లేదా ఆపై దిశగా పయనించవచ్చు"ని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విభాగ అధిపతి అనింద్య బెనర్జీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత తరుణంలో రూపాయిని ఆదుకునేందుకు ఫారెక్స్ కార్యకలపాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని, లేదంటే కరెన్సీ విలువ మరింత పతనం కావచ్చని, అది మారకం విలువలో తీవ్ర హెచ్చుతగ్గులకు కూడా దారితీయవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా, ఫెడ్ రేట్ల తగ్గింపు అవకాశాలు, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయికి మద్దతు లభించవచ్చని, ముమ్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.89.60-90.20 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.78 ఏళ్ల స్వతంత్ర భారతంలో రూ.3.30 నుంచి రూ.90 వరకు..భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది (1947)లో రూ.3.3గా ఉన్న డాలర్-రూపాయి మారకం విలువ.. 1990 దశకం వరకు చాలా నెమ్మదిగానే తగ్గుతూ వచ్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో (1991) తొలి తరం ఆర్థిక సంస్కరణలు చేపట్టినప్పటి నుంచి రూపాయి విలువ వేగంగా కరుగుతూ వచ్చింది. నరేంద్ర మోదీ తొలిసారి అధికారంలోకి వచ్చిన 2014లో రూ.62 స్థాయిలో ఉన్న రూపా యి మారకం విలువ.. గడిచిన 11 ఏళ్లలో మరింత వేగంగా క్షీణిస్తూ వచ్చింది. ఏటేటా పెరుగుతూ వస్తున్న వాణిజ్య లోటు, ముడి చమురు, పసిడి సహా పలు దిగుమతులపై ఆధారం పెరగడం, అధిక ధరలు వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి.

# రూపాయి రికార్డు పతనం సూచీలకు భారీ నష్టాలు




విదేశీ మదుపర్లు రూ.1, 171 కోట్ల విలువైన షేర్లను అమ్మేయడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అలాగే ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత ఇప్పట్లో ఉండదనే అంచనాలు, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం సూచీలను వెనక్కి లాగాయి.డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (రూ.90) రికార్డు కనిష్టానికి పడిపోవడం మదుపర్లను కలవరపెట్టింది. దీంతో సూచీలకు వరుసగా రెండో రోజు కూడా నష్టాలు తప్పలేదు. రోజంతా సూచీలు నష్టాల బాటలోనే సాగాయి. సోమవారం విదేశీ మదుపర్లు రూ.1, 171 కోట్ల విలువైన షేర్లను అమ్మేయడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అలాగే ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత ఇప్పట్లో ఉండదనే అంచనాలు, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం సూచీలను వెనక్కి లాగాయి. దీంతో ఈ రోజు సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో రోజును ముగించాయి. .గత సెషన్ ముగింపు (85, 6416)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 300 పాం యింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. నెగిటివ్ వార్తల కారణంగా చివర్లో అమ్మకాలు పెరగడంతో సెన్సెక్స్ భారీగా ంది. చివరకు సెన్సెక్స్ 503 పాయింట్ల నష్టంతో 85, 138 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 143 పాయింట్ల నష్టంతో 26, 032 వద్ద స్థిరపడింది .ఆసియన్ పెయింట్స్, హిటాచీ ఎనర్జీ, మదర్సన్, వోడాఫోన్ ఐడియా, గ్లెన్‌మార్క్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి ఇండియన్ బ్యాంక్, నవుమా హెల్త్‌కేర్, ఎన్‌బీసీసీ, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, అదానీ ఎనర్జీ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 132 పాయింట్లు నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ 407 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.87గా ఉంది.

## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?



ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు- ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్



అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత- రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము‘ అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



## ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

### అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.



## కార్తీ...తెలుగులో అన్నగారు వస్తారు

**స్టార్ నటుడు కార్తీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం వా వాతియార్ . తెలుగులో ఈ చిత్రం అన్నగారు వస్తారు అనే పేరుతో విడుదల కాబోతుంది. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జిఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కెఇ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాను డిసెంబర్ 12న తమిళంతో పాటు తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో కార్తీ పోలీస్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు కార్తీ సర్దార్ 2ని కూడా విడుదలకు సిద్ధం చేస్తున్నాడు.**





## ఐఎండీబీ 2025 పాప్యులర్ స్టార్స్

### : జాబితాలో టాలీవుడ్‌కు నిరాశ.. టాప్‌లో బాలీవుడ్ కుర్రాళ్లు!

సినిమా రేటింగ్స్, రివ్యూలకు అత్యంత ప్రామాణిక వేదికగా భావించే ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ (ఐఎండీబీ) ఈ ఏడాదికి గాను మోస్ట్ పాప్యులర్ భారతీయ తారల జాబితాను విడుదల చేసింది. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా విడుదలైన ఈ లిస్ట్ సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, ఈ జాబితాలో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఒక్క నటుడికి కూడా స్థానం లభించకపోవడం గమనార్హం.ఐఎండీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం ఈ ఏడాది పాప్యులర్ స్టార్స్ జాబితాలో 'సైయారా' సినిమాతో విజయం అందుకున్న బాలీవుడ్ యువ నటులు అహన్ పాండే, అనిత్ పడ్డా




వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. 'కూలీ' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన అగ్ర నటుడు ఆమిర్ ఖాన్ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. 'హోమ్




## దురంధర్ మూవీపై సద్దుమణిగిన వివాదం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా రాబోతున్న తాజా చిత్రం 'ధురంధర్' పై తలెత్తిన వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సినిమా కథకు, అమరుడైన మేజర్ మోహిత్ శర్మ జీవితానికి ఎటువంటి సంబంధం లేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ స్పష్టం చేసింది. మేజర్ మోహిత్ శర్మ జీవిత చరిత్ర ఆధారంగా తమ అనుమతి లేకుండా ఈ సినిమాను తెరకెక్కించారంటూ ఆయన తల్లిదండ్రులు కొద్ది రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మీడియాతో పాటు, సోషల్ మీడియాలోనూ ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ జీవితాధారంగానే తెరకెక్కిందన్న చర్చ జరిగిందని, దీనిపై చిత్ర బృందం తమను సంప్రదించడం గానీ, స్పందించడం గానీ చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కారణంగా, సినిమాను తమకు ప్రత్యేకంగా చూపించాలని, అప్పటివరకు విడుదలను నిలిపివేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. దీంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ సినిమాను పునః పరిశీలించింది.పునః పరిశీలన అనంతరం 'ధురంధర్' చిత్రం కేవలం ఒక కాల్పనిక కథ అని, ఇది మేజర్ మోహిత్ శర్మ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించబడలేదని కోర్టుకు నివేదించింది. దీంతో ఈ సినిమాపై ఉన్న వివాదం


Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com